
మరనాత మెసేంజర్
క్రైస్తవ ఆధ్యాత్మిక మాసపత్రిక
MARANATHA MESSENGER
MARANATHA VISVASA SAMAJAM
విడి ప్రతి
రూ.10/-
సంపుటి 37
సెప్టెంబరు 2019
సంచిక 9

## ఈ సంచికలో...


1. లూకా సువార్త - 39 - శ్రీ గుళ్ళపల్లి మోజెస్ చౌదరి
2. ఆధ్యాత్మిక విజ్ఞాన ధారావాహిక - 23 - డా॥ నిరీక్షణ కె. కంచర్ల
3. సహవాసంలో వాసం - సహోదరి ఎ. ఉషారాణి
4. ఎఫెసీ పత్రిక - 13 - రెవ. అల్లూరి విశ్వప్రసాద్
5. 1 కొరింథి పత్రిక ధ్యానములు - 2 - రెవ. గొట్టిపాటి యేసుదాసు
6. జ్ఞానధార - డా॥ కొటారి మనష్షే
7. వార్తల్లో కొన్ని...



ప్రధాన సంపాదకులు : శ్రీ గుళ్ళపల్లి మోజెస్ చౌదరి

సంపాదక వర్గం :

రెవ. ఫిలిప్ ప్రకాష్, రెవ.డా॥ నిరీక్షణ కంచర్ల, రెవ. బి.యం.రాజు, రెవ.జి.యేసుదాసు


మీ చందాలు, వ్యాసములు ఈ క్రింది చిరునామాకు పంపించండి


**మరనాత మెసెంజర్**

గాయత్రి నగర్, విజయవాడ - 520 008.

Phone : 0866 - 2480047, e-mail : mvs828@gmail.com



Bank Details : THE SOUTH INDIAN BANK LTD

A/c No.0142073000000861 IFSC : SIBL0000414


**ప్రకటన వివరాలు**

పూర్తి పేజి : రూ. 1,500/- అరపేజి : రూ. 800/-

టైటిల్ పేజి 3 లేక 4 : పూర్తి పేజి రూ. 3,000/- అరపేజి రూ.1,500/-

| | స్వదేశములో | విదేశములో |
|---|---|---|
| సాలుసరి చందా | రూ. 150/- | రూ. 1,000/- |
| విశేష సభ్యత్వం | రూ. 1,000/- | రూ. 3,000/- |
| జీవిత సభ్యత్వం | రూ. 5,000/- | రూ. 15,000/- |


This Magazine is Printed, Published and Owned by G. Moses Choudary & Printed at Alpha & Omega Publications & Printing Works, # 59-8/1-6/3, Gayatri Nagar, Vijayawada - 520 008. This Magazine is Edited by G. Moses Choudary, # 59-8/1-6/3, Gayatri Nagar, Vijayawada - 520 008.

# లూకా సువార్త
## (39 వ భాగము)

శ్రీ జి. మోజెస్ చౌదరి, విజయవాడ

## పాస్టర్లు అంటే.. ? : (లూకా సువార్త 9 : 1-9)

పాఠకులైన మీరు మీ కుటుంబమంతా కుశలమేనా? దేవుని కృపను ఆస్వాదిస్తూ, అనుభవిస్తూ జీవిస్తున్నారా? దేవుని దృష్టిలో ఆయన చిత్తానికి అనుగుణంగా జీవిస్తే దేవుని దీవెన సిరులు ఎంతో అద్భుతంగా అనూహ్యంగా మీకు సంక్రమిస్తాయి.

**"యేసు తన పన్నెండుమంది (శిష్యులను) పిలిచి, సమస్తమైన దయ్యములమీద శక్తిని అధికారమును, రోగములు స్వస్థపరచు వరమును వారికనుగ్రహించి దేవుని రాజ్యమును ప్రకటించుటకును రోగులను స్వస్థపరచుటకును వారి నంపెను. మరియు ఆయన- మీరు ప్రయాణము కొరకు చేతికఱ్ఱనైనను జాలెనైనను రొట్టెనైనను వెండినైనను మరి దేనినైనను తీసికొని పోవద్దు; రెండు అంగీలు ఉంచుకొనవద్దు. మీరు ఏ యింట ప్రవేశింతురో ఆ యింటనే బసచేసి అక్కడనుండి బయలుదేరుడి. మిమ్మును ఎవరు చేర్చుకొనరో ఆ పట్టణములోనుండి బయలుదేరునప్పుడు వారిమీద సాక్ష్యముగా ఉండుటకు మీ పాదధూళి దులిపివేయుడని వారితో చెప్పెను. వారు బయలుదేరి అంతటను సువార్త ప్రకటించుచు, (రోగులను) స్వస్థపరచుచు గ్రామములలో సంచారముచేసిరి" (లూకా సువార్త 9 : 1-9).**

ప్రభువైన యేసు మానవరూపిగా ఉన్న 33 1/2 సంవత్సరాలలో చివరి మూడున్నర సంవత్సరాలలో తనకు 12 మంది శిష్యులను ఏర్పాటుచేసుకొని వారితో కలిసి పాదచారిగా సంచారము చేస్తూ దేవుని రాజ్య సువార్త ప్రకటిస్తూ వచ్చాడు. యేసు తన శిష్యులతో - మీరు వెళ్లండి, దేవుని రాజ్యవార్తను ప్రకటించండి. దైవం మానవరూపిగా వచ్చాడని చెప్పండి. దయ్యాలను వెళ్లగొట్టండి, రోగులను బాగుచేయండని వరమిచ్చి పంపించాడు. ఈ పన్నెండుమంది శిష్యులు అత్యంత సామాన్యులు. వారిలో నలుగురు చేపలుపట్టే జాలరులు. మరో నలుగురు గతంలో జలోతే అను ఉగ్రవాద ఉద్యమములో పనిచేసి, రోమా సామ్రాజ్యాధీసుల పాలననుండి ఇశ్రాయేలు ప్రజలైన యూదులకు స్వాతంత్ర్యం తెచ్చిపెట్టాలని కంకణం కట్టుకొనిన ఉద్యమకారులు. మరొక నలుగురు నాలుగురకాల కుటుంబ చరిత్రలు కలిగినవారు. **దేవుని సేవ చేసేవాళ్లకి విద్యార్హతలు, పాండిత్యము ఉండవచ్చు కాని అత్యంత సామాన్యమైన జీవిత విధానమును ఎంచుకొన్నవారు కావాలి. స్వాతిశయపూర్ణులు, అహంకారులు ఈ దేవుని సేవలో నిలదొక్కుకోలేరు. యేసయ్య సేవకు**

**కృషీవలులు, కష్టపడి పనిచేసేవారు, క్రమశిక్షణాయుతముగా ఉన్నవాళ్లు కావాలి. దేవుని సేవ చేయాలనుకొనే దైవ సేవకుడు దేవుని పిలుపు పొందినవాడై యుండాలి.**

**నేను ఈ ప్రభువును ఎరుగకముందే దేవుని పిలుపు నాకు వినబడుతూ ఉండేది.** మా ఇంట్లో మా అమ్మగారితో కలిసి మరో ఐదారుగురు స్త్రీలు వచ్చి ప్రార్థనచేస్తూఉంటే వాళ్లలోనుంచి ఎవరోఒకరిద్వారా అన్యభాషలతో మాట్లాడుతూ మధ్యలో- **నా కుమారుడా, తల్లి గర్భం ముందునుంచి నిన్ను నా సేవార్థమై ఎంచుకున్నాను నా కుమారుడా అనే దైవ స్వరము వినబడేది.** నా చిన్ననాడే తండ్రిని పోగొట్టుకొన్న అభాగ్యుడిని, ఈ దేవుడు ఎవరో నన్ను కుమారుడా అని పిలుస్తున్నాడు అనుకొనేవాణ్ణి. సేవ ఏమిటో నాకు అర్థమయ్యేది కాదు. నేను యవ్వనస్తుడిగా ఉన్నకాలంలో వినబడేది. కాని అప్పటికి నాకు దేవునితో సత్సంబంధం లేకపోవడముతో ఆయన పిలుపు ఆయన స్వరము నాకు అర్థమయ్యేదికాదు. **ఎప్పుడైతే నేను ప్రభువును నిజదేవునిగ, రక్షకునిగా అంగీకరించి, నా పాపాలు పశ్చాత్తాపంతో ఒప్పుకున్నానో నాకు దేవునితో సత్సంబంధం ఏర్పడింది. ఆ ఘడియలో దైవికమైన శక్తిని, మహిమను అంతరంగములో అద్భుతంగా అనుభవించాను. దేవుని యొక్క పిలుపును నేను గ్రహించాను.** సోదర సోదరీలారా, దేవునితో మీకు సత్సంబంధం, సదవగాహన దృక్పధం లేకపోతే దేవుడు మీతో మాట్లాడిన మీకు అర్థం కాదు. ఇదంతా మతము, మతబోధ అని చాలామంది అనుకోవడానికి కారణం వారికి దైవికమైన దృక్పధం లేకపోవడమే!

**దేవుడు తన సేవార్థమై పిలిచిన వారిని తర్ఫీదు చేస్తాడు. తర్ఫీదు పొందినవాళ్లు దేవుని ఆత్మ శక్తిని అభిషేకాన్ని పొందుకోవాలి. ఆ తరువాత దేవుడు చూపించిన స్థలానికి వెళ్లి సేవాక్షేత్రంగా ఎంచుకొని అక్కడ ప్రజల దీవెనార్థమె వారి మార్పుకొరకై ప్రార్థన చెయ్యాలి, కృషి చెయ్యాలి, దేవుని కొరకు పనిచెయ్యాలి. తద్వారా ప్రజలు దీవించబడతారు, స్వస్థపరచబడతారు, దయ్యాల బారినుండి దురభ్యాసాల వ్యసనాల బారినుండి విడుదల పొందుతారు. దేవుని నామం మహిమపరచ బడుతుంది. ఇదే దైవ సేవకులయొక్క పని.**

అలాకాకుండా ఆర్థికసహాయం కొరకైన ఆరాటంతో అర్రులుచాస్తూ పరుగులుపెట్టే ధోరణిని కొందరు సేవకులలో చూస్తాను. యేసయ్య తన శిష్యులను పంపించునప్పుడు కొన్ని సంగతులు లేఖనభాగములో ప్రస్తావించాడు.

**1. దేవుని రాజ్య వార్త ప్రకటించండి :-** దేవుని సన్నిధి ఎక్కడ ఉంటుందో, దేవుడు ఎక్కడ ఏలుబడి చేస్తాడో అక్కడ శాంతి సమాధానం ఆశీర్వాదాల పరంపర అద్భుతంగా సంక్రమిస్తాయి కాబట్టి దేవుని రాజ్యాన్ని గూర్చి ప్రకటించండి. అంటే, ప్రభువుయొక్క సువార్త సందేశాన్ని దైవసేవకుడు అందిస్తూ ఉన్నప్పుడు. దేవుని వాక్శక్తి, పరిశుద్ధాత్మ శక్తి కలసి అదృశ్యరూపంలో ప్రజలను ప్రభావితం చేస్తూఉండగా అవి వింటున్న ప్రజలలో విశ్వాసం కలుగుతుంది. వింటున్నవారిలో బాగా చెప్పాడు అనేవాళ్లున్నారు.

వాళ్లు అంతవరకే ప్రభావితులయ్యారు. కాని అంతకుమించిన దేవుని యొక్క దివ్యమైన సూత్రాలు, సందేశాలు మీమీద ప్రభావంచూపాలని కోరుతూఉన్నాం. అదే ఈ సేవలో ఉన్న ఉద్దేశ్యం. చాలామంది అవగాహనలేక అదంతా మతబోధ అని అంటారు. ఇది మతము కాదు, మతబోధ కాదు. మారుమనసును కలిగించి, మనిషిని మనిషిగా నైతిక విలువలతో తీర్చిదిద్దే అద్భుతమైన ప్రభువైన యేసు సువార్త సందేశాలివి. మీ దేవుడు గొప్పవాడైతే ఊరూరా తిరిగి ఎందుకిలా చెప్పుకోవడం అంటారు. ఎరిగిన సత్యాన్ని మరుగు చేయడం ఎంతో దోషపూరితం. ఇంతగొప్ప దేవునిని మంచంక్రిందో కుంచంక్రిందో దాచి పెట్టమంటారా, అసత్యవాదులు ఎంత దోషులో ఎరిగిన సత్యాన్ని మరుగుచేసేవాళ్లు కూడ అంతే దోషులని నేను మనవిచేస్తున్నాను. అట్టి దోషానికి నేను పాల్పడడానికి వీల్లేదు. ఈ దేవుడు నన్ను పిలిచి, ఆయన నాకు చూపించిన దర్శనాన్ని, సందేశాన్ని నాతోటి ప్రజలైన భారతీయులతో పంచుకోమని చెప్పాడు. **మనిషిని మనిషిగా తీర్చిదిద్దే యేసు సువార్త సందేశం ఆయా ప్రపంచదేశాల్లోని కోట్లాది జీవితాలను మార్పు చేస్తోంది. సువార్తప్రకటించే దైవసేవకుడు ఎప్పుడూ దేవుని అధికారముతో, దేవుని ఆత్మ అభిషేకముతో, ఆత్మ శక్తి, ఆత్మావేశముతోనే దేవుని యొక్క సందేశాలు అందించ బద్ధుడైయున్నాడు.**

**దైవసేవకుడు ఎప్పుడూ క్రమశిక్షణ కలిగిఉండాలి :- దైవ సేవకునికి ఆహార పానియాలలో క్రమశిక్షణ ఉండాలి. ఆరోగ్య నియమాలు పాటించడములో మరియు సమయాన్ని పాటించడములో క్రమశిక్షణ ఉండాలి. తననుతాను నలగ్గొట్టుకొంటూ దేవుని సన్నిధిలో ప్రభువు పాదములయొద్ద పడి ప్రజలకొరకు ఆక్రందన చేస్తూ ఆవేదనతో ప్రార్థనలు, విజ్ఞాపనలు సల్పుతూ దైవశక్తిని పొంది దైవావేశముతో దైవ సందేశాలు అందించబద్ధుడు.**

**2. మీరు ప్రయాణము కొరకు చేతికఱ్ఱనైనను జోలెనైనను రొట్టెనైనను వెండినైనను మరి దేనినైనను తీసికొని పోవద్దు; రెండు అంగీలు ఉంచుకొనవద్దు. మీరు ఏ యింట ప్రవేశింతురో ఆ యింటనే బసచేసి అక్కడనుండి బయలుదేరుడి :-** ఒక ఇంట్లో మీరుంటే ఆ చుట్టుప్రక్కలవాళ్లు, ఆ ఊరివాళ్లు ఎవరైనా మీ దగ్గరకు వచ్చినప్పుడు వాళ్లకు సువార్త చెప్పి వాళ్ల కొరకు ప్రార్థనలు చేయమని ప్రభువు సెలవిచ్చాడు. విచిత్రమేమిటంటే దైవసేవకుడు లగేజి (బరువు తీసికెళ్లవద్దు అన్నాడు. అంటే బరువు ఎక్కువుంటే అవి మనిషిని కృంగదీస్తాయి. గతంలో మన ఇండియన్ రైల్వేస్‌లో ప్రతి ట్రైన్ సీటుమీద లెస్ లగేజ్ మోర్ కంఫర్ట్ అనిఉండేది. అంటే లగేజి ఎంత తక్కువుంటే అంత సౌకర్యం, సుఖలబ్ధి చేకూరుతుంది. జీవితానికి ఉపకరించే అద్భుతమైన సూత్రం ఉంది ఇందులో! దైవ సేవకుడు కూడ సొంత సంపాదన గూర్చిన భారము, సొంత బాధ్యతలు, కుటుంబ బాధ్యతలు ఎక్కువైనబరువులు పెట్టుకొంటే దైవికమైన భారాన్ని ప్రజలకొరకు మోయటములో వెనుకబడే ప్రమాదముంది.

దైవసేవకులైన సోదర, సోదరీలారా మనమే వ్యక్తిగత బరువు బాధ్యతలు, సమస్యల క్రింద నలిగిపోతే, ప్రజల మధ్యకువెళ్లి ఈ మహాదేవుని గురించి ఎలా చెప్పగలుగుతాం. వారి బాధల బరువులు మనమెలా మోయగలుగుతాం..! మా మరనాత విశ్వాస సమాజములో ఉన్న దైవసేవకులకు నేనప్పుడూ చెబుతూ ఉంటాను. మీ సంఘములో గాని మరి ఎవరికైన చీమకుట్టినట్లు మీకు తెలిస్తే అది మీకు తేలు కుట్టినట్లుగ ఉండాలి. అంటే, వాళ్ల చిన్నబాధ మీకు పెద్ద బాధగా అనిపించాలి. మీరలా అనుభవించితేనే ప్రజలమధ్యకు వెళ్లి దేవుని సేవ చేయగలుగుతాము అని. **దేవుడు మన బ్రతుకు తెరువు కోసం మనలను సేవకులుగా పిలువలేదు. వ్యసనాల బానిసత్వములో, దయ్యపు శక్తులు, దురాత్మల బారినుంచి, వాటి ప్రభావముచే చావుకు లోనైన ప్రజలను విడిపించాలి, వ్యాధిగ్రస్తులను బాగుచెయ్యాలి. అందుకు దేవుడు మనలను పంపించాడు. ప్రజల బాధలు పట్టనటువంటి సేవకుడు సేవకుడినని చెప్పకోవడం సిగ్గుచేటు.**

ఆత్మ సంబంధమైన దీవెనలు, భౌతిక సంబంధమైన దీవెనలు కూడ ప్రజలకు కలుగచెయ్యాలి. **ఇది ప్రజలకు దైవసేవకులు కలిగించే మేలు. ఇట్టి అద్భుతమైన సేవ చేయడానికే దేవుడు తన సేవకులను నియామకం చేసాడు. తర్ఫీదుచేసి నమ్మి అప్పగించాడు.** మిషనరీలు ఆహారం, శుభ్రత, రక్షణ అనే సూత్రంతో దేశదేశాలకు వెళ్లి జీవితాలను త్యాగాలు చేశారు. ఆయా దేశాలలో బాధితులైన దళిత వర్గాల ప్రజలలో గొప్ప నైతిక, ఆధ్యాత్మిక, సామాజిక చైతన్యాన్ని తీసుకువచ్చారు. అగ్రవర్ణాలు అనబడేవారు, జాత్యహంకారులు మిమ్ములను అణగద్రొక్కినంత మాత్రాన మీరు వేరుకాదు. దేవుడు మిమ్ములను సృష్టించాడు అని మనుష్యులను మనుష్యులుగా తీర్చిదిద్దే అద్భుతమైన సువార్త సందేశాలు చెప్పారు. వారికి ఆహార పానీయాలనందించి, శుభ్రత సూత్రాలు నేర్పించి, వైద్యశాలలను నిర్మించి ఆరోగ్యాన్ని కలిగించే గొప్ప త్యాగపూరితమైన సేవలు చేసారు.

**నేను 1973లో అమెరికాలో విద్యాభ్యాసములో ఉన్నప్పుడు అప్పటి మన గౌరవనీయ ప్రధానమంత్రి శ్రీమతి ఇందిరాగాంధి సెయింట్ స్టీఫెన్స్ కాలేజి ఇనిస్టిట్యూషన్స్ యొక్కసెంటినరి సెలబ్రేషన్స్‌కు హాజరై గొప్ప స్పీచ్ ఇచ్చారు.** ఆ స్పీచ్ అంతటిని అమెరికాలో ఒక న్యూస్ పేపర్ ప్రింట్ చేస్తే నేను చదివాను. ఆ తల్లి చెప్పిన ఆ సందేశం అద్భుతమైనది. **మిషనరీ ఉద్యమం భారతదేశ నిర్మాణములో ఎంత గొప్ప త్యాగపూరితమైన సేవలందించిందో ఈ దేశ సౌభాగ్యం కొరకు మిషనరీలు అందించిన సేవలు ఎంత శ్లాఘనీయమైనవో ఆమె ఇచ్చిన ఉపన్యాసం నేను చదివి ఆశ్చర్యపోయాను. రాజకీయ నాయకులు ఈ మిషనరీ దైవ సేవకులు చేసే సేవల విలువను గుర్తిస్తే దేశానికి మరెంతో మేలు కలుగుతుంది. మీడియా వారు కూడ ఈ దైవ సేవకులు చేసే త్యాగపూరితమైన సేవలను గూర్చి చెప్పనర్హమైన, వ్రాయనర్హమైన వార్తలను చెబుతూ, రాస్తూ ఉంటే ప్రజలకు మేలు కలుగుతుందని నా మనవి.** ప్రజలకు ఉపయోగం లేనివెన్నో

చూపిస్తున్నారు. **త్యాగపూరితముగా జీవితాలను ఖర్చుపెడుతూ ఊరూరు పిచ్చివాళ్లుగ తిరుగుతూ జీతనాతాలతో నిమిత్తం లేకుండా నమ్మిన ప్రజలిచ్చే అర్పణలతో ఉండి లేక పస్తులుండి వస్త్రహీనత ననుభవించి జీవనం చేస్తూ, కుటుంబజీవితాన్ని లెక్క చేయకుండా సువార్తను అందించే సేవకుల సేవలను అప్పుడప్పుడూ ప్రస్తావిస్తే ప్రజలకెంతో మేలు కలుగుతుందని నా అభిప్రాయం. క్రైస్తవ్యం చేసిన త్యాగపూరితమైన సేవలయొక్క ఔన్నత్యం ప్రపంచ స్థితిగతులను మార్పుచేసిందనే మాట చరిత్రపుటల్లోకి వెళ్లి చూస్తే మనకు తెలుస్తుంది. ఎక్కడ త్యాగముందో, అంకితభావముందో దాన్ని గుర్తిద్దాం, ప్రోత్సహిద్దాం. తద్వారా అనేకులకు మేలు చేకూరుద్దాం.**

మరి ప్రభువైన యేసు అనేకమంది దైవ సేవకులను పంపిస్తున్నాడు. మరనాత విశ్వాస సమాజపు సహవాసములో 150 మంది సుమారుగా ఉన్నారు. త్యాగపూరితంగా జీవితాలను ఖర్చుపెడుతున్నారు. దేవుడు మీ ఇంటికి గాని, మీ ఊరికిగాని పంపించిన దైవసేవకుని చేర్చుకోండి. విశ్వాసులారా - మీ సంఘ కాపరిని గౌరవించండి, సన్మానానికి పాత్రులుగా ఎంచండి. వారి నాయకత్వములో దేవుని సేవలో సహకరించండి, దైవ దీవెనలు పొందుకోండి. సేవకుల పేరుతో మోసగాళ్లు వస్తున్నారు. వారికి చందాలు ఇవ్వబోకండి. జాగ్రత్తగా ఉండండి. దేవుడు మిమ్ములను మీ కుటుంబాలను బహుగా ఆశీర్వదించి వర్ధిల్లజేయును గాక. **- మరనాత.**

# గమనించండి - సహకరించండి

మీరు "మరనాత మెసేంజర్" పట్ల చూపుతున్న ఆదరాభిమానాలకు కృతజ్ఞులము. ముద్రణావ్యయము పెరిగిన కారణముగా జనవరి 2018 నుండి పత్రిక సాలుసరి చందా రూ.150/-కు పెంచడమైనది. గాన పాఠకులు గమనించి సహకరించగలరు. మీరు సాలుసరి చందా చెల్లించారా? లేనియెడల త్వరగా చెల్లించి పత్రికా పరిచర్యలో మీవంతు సహకారమును అందించండి, ప్రార్థించండి. మీ చందా పంపునప్పుడు యం.ఓ ఫారంలో సమాచారము కొరకు ఇవ్వబడిన స్థలములో మీ పేరు, పూర్తి అడ్రస్సు (ఇంటి నెంబరు, వీధిపేరు తప్పక రాయాలి మరియు మీ అడ్రస్సు మారినచో పాత, క్రొత్త అడ్రస్సులు పిన్ కోడ్ నంబరుతో సహా) వ్రాసి మీకు రిసిప్టులు, పత్రికలు పంపడంలో ఎదురయ్యే సమస్యలను అధిగమించడానికి మాతో సహకరించ వలసినదిగా పాఠకులకు మనవి. **- ఎడిటర్స్.**

# అభ్యర్ధన - ఆచరణ - ఆశీర్వాదము

ఆయన (యేసు) మీతో చెప్పునది చేయుడి

డా॥ నిరీక్షణ కె. కంచర్ల
M.A., MBA., M.A., M.Div., M.Th., D.Min., Ph.D.
డైరెక్టర్ - మరనాత థియోలాజికల్ సెమినరీ
హైదరాబాదు. సెల్ : 9849746464

## యూదా రాజు-మనష్షే

**( 2 రాజులు 21 : 1-18 మరియు 2 దిన. 32 : 33 - 33 : 20 )**

పాఠక మిత్రులందరికి నమస్కారములు.

దేవుడెప్పుడూ తన చిత్తమును, తనకు విధేయులైన వారిద్వారా ప్రపంచమునకు ప్రత్యక్షపరచటం ఆనవాయితి. వారు స్త్రీలైనా, పురుషులైనా, సామంతులైనా, సామాన్యులైనా, పండితులైనా, పామరులైనా వారి విధేయత, విశ్వాసమును బట్టి వినియోగించుకొని తన ప్రేమను ప్రజలకు పంచి వారిని సంరక్షిస్తున్నాడు. ఇది అనాదికాలమునుండి జరుగుచున్న దైవ మానవ భాగస్వామ్య పథకం. భూలోకములో ఉన్న సర్వప్రజలను తన కన్నబిడ్డలవలె ఎంచి, తన ప్రేమను పంచి, పెంచి నడిపిస్తున్నాడు. అయితే దేవుని మాటకు విధేయులైన వారు దీవెనలు, సంరక్షణ పొందుకొనుచున్నారు. మిగిలినవారు వారి స్వయంకృతాపరాధముల వలన తమంతట తాము శిక్షలను కొనితెచ్చుకుంటున్నారు. అంతేగాని దేవుడెవరినీ అనవసరంగా శిక్షింపడు (యాకోబు 1 : 13-15).

పైన ప్రస్తావించిన మనష్షే యూదా రాజ్యమునకు 14వ రాజు (బి.సి. 709-643). అతడు ఏలనారంభించినప్పుడు 12 ఏండ్లవాడై యెరూషలేములో 55 సంవత్సరములు ఏలెను. అతని తల్లి పేరు హెఫ్సిబా (2 రాజులు 21 : 1). ఆనాటి రాజవంశ క్రమము ప్రకారము తన తండ్రియైన హిజ్కియా మరణించిన తరువాత మనష్షే అతి చిన్నవయస్సులోనే యూదా రాజ్యభారమును చేపట్టవలసి వచ్చింది. మనకు తెలిసినట్లు కొంతమంది పుట్టుకతోనే దుష్టులుగా పుడతారు. వారు చిన్నప్పటినుండి చేదు లక్షణాలను కనుపరుస్తారు. వయస్సు చిన్నది మాటలు పెద్దవి (యిర్మియా 32 : 30). కీర్తనలు 58 : 3 - "తల్లి కడుపున పుట్టినది మొదలుకొని భక్తిహీనులు విపరీతబుద్ధి కలిగియుందురు. పుట్టిన తోడనే అబద్ధములాడుచూ తప్పిపోవుదురు''. మనష్షే 12 ఏండ్ల వయస్సులోనే దేవునికి, దేశానికి విరుద్ధంగా ప్రవర్తించటం మొదలుపెట్టాడు.

"ఇతడు ఇశ్రాయేలీయుల ఎదుటనుండి వెళ్ళగొట్టిన అన్యజనులు చేసిన హేయక్రియలను

అనుసరించి యెహోవా దృష్టికి చెడునడత నడచెను"(2 దిన. 33 : 2). ద్వితీ. 18 : 9 -"నీ దేవుడైన యెహోవా నీకిచ్చుచున్న దేశమున నీవు ప్రవేశించిన తరువాత ఆజనుల హేయకృత్యములను నీవు చేయనేర్చుకొనకూడదు". దేవుడు నియమించిన కట్టడలను పట్టించుకోకుండా, తన యిష్టము చొప్పున, దేవుడిచ్చిన అధికారమును మనష్షే దుర్వినియోగం చేశాడు. అసమర్ధులకు, సోమరులకు అధికారం వస్తే ఇలాగే వ్యవహరిస్తారు..?? వారికి తెలియదు, జ్ఞానంగలవారి మాటలు వినే చెవులుండవు ! ఎంతసేపూ తమ సౌఖ్యం చూచుకుంటూ వెఱ్ఱి అధికారులుగా కొనసాగుతారు. ఇలాంటివారికి ఈ దేశంలో కొదువలేదు. ఇటు ఆధ్యాత్మిక రంగములో అటు అనాధ్యాత్మిక రంగంలో కొందరు యధేచ్ఛగా కొనసాగుతున్నారు. వంశపారంపర్యంగా వచ్చిన రాజకీయం మరియు యాజకీయం..?! దేవుని పిలుపు, దర్శనం, భారం ఉండి తల్లిదండ్రుల సేవను కొనసాగించటం తప్పులేదు. గాని అవేవి లేకుండా మా అమ్మానాన్న చేసిన సేవ గనుక నేను కొనసాగిస్తానని ఎవ్వరూ అనకూడదు..? గాని ఈరోజుల్లో చాలామంది భారం లేకుండా బాధ్యతలేని సేవను జరిగిస్తున్నారు. ప్రజల బాధలను, యిబ్బందులను పట్టించుకోకుండా కట్టిపెట్టిన సంఘములలో అనవసర అధికారం ప్రదర్శిస్తూ, దేవుని సేవా సూత్రాలను ఉల్లంఘిస్తున్నారు. ఇది నేరం. ఇలాంటివారు ఈనాడు ఎక్కువైపోయారు. అట్టివారి విషయములో విశ్వాసులు అప్రమత్తంగా ఉండాలి. వారి ప్రధానమైన లక్షణమేమి టంటే ఆడంబరము, ఆధ్యాత్మికత కాదు. వారి తల్లిదండ్రులు, తాత ముత్తవలు ఎంతో కష్టపడి సేవచేసి, ఓ స్థలం కొని మందిర నిర్మాణం చేశారు. ఓ ఆధ్యాత్మిక వ్యవస్థను కట్టి కాలం చేశారు. వారి సంతానంగా పుట్టుకొచ్చిన కొంతమంది భారం, బాధ్యత లేకుండా ప్రజలకొరకైన పరితాపమును ఏకోశానా కనుపరచక వ్యర్ధులౌతున్నారు. ఎంతో కష్టపడి ఓ వ్యవస్థను పెద్దలు ఏర్పాటు చేసి గతిస్తే, వారి సంతానముగా చెప్పుకొనే అనేకులు భ్రష్టులై పనికిరాని సేవను ఈనాడు జరిగిస్తున్నారు. ఇట్టి విధానము బహు విచారకరమైనది. ఇలాంటి వారిని గూర్చియే యెహెజ్కేలు మాట్లాడుతున్నాడు.

యెహెజ్కేలు 34 : 3-4 - "మీరు క్రొవ్విన గొఱ్ఱెలను వధించి క్రొవ్వును తిని బొచ్చును కప్పుకొందురు గాని గొఱ్ఱెలను మేపరు. బలహీనమైన వాటిని బలపరచరు, రోగముగల వాటిని స్వస్థపరచరు. గాయపడిన వాటికి కట్టు కట్టరు, ... వాటిని ఏలుదురు". పై వచనములు అందరి సేవకులకు వర్తించవు గాని, అడ్డగోలుగా సేవలో ప్రవేశించి, దేవుని చిత్తమునకు విరుద్ధంగా ప్రవర్తించే సేవకులను ఉద్దేశించి దేవుడు ఆ వాక్యములు వ్రాయించాడు. ఇక్కడో సంగతిని గ్రహించాలి, కొన్నిసార్లు గొఱ్ఱెలు (విశ్వాసులు) కూడా స్థిరపడిన తరువాత అనవసర ఆలోచనలు, గర్వంతో మంచి కాపరుల సంరక్షణలో నుండి చిన్నచిన్న కారణాలతో తప్పిపోతున్నారు. అలాంటివారిని తిరిగి సమకూర్చటం కష్టం. అట్టివారిని మినహాయిస్తే, బాధ్యతలేని సంఘకాపరుల వలన దేవుని సేవకు నష్టం కలుగుతోంది.

మనష్షే తన అనుభవానికి, వయస్సుకు మించిన బాధ్యతతో తిరుగుబాటుదారుడై తప్పిపోయాడు. అవసరమైన వాటిని ఎన్నింటినో చేశాడు. బెన్‌హిన్నోము లోయయందు అతని కుమారులను అగ్నిగుండమును దాటించాడు. ఇవన్నీ అనవసరము. ఇవి తప్పని తెలిసినా, అధికార దుర్వినియోగం చేసి దేవుని చిత్తమునకు తెలిసి అవిధేయుడయ్యాడు. ఇట్టి చర్యలు అతని దురహంకార పోకడలకు సూచన. అట్టివాటిని ఎవ్వరూ జరిగింపరాదు.

దేవుడు తన ప్రవక్తల ద్వారా మనష్షేను హెచ్చరిస్తూనే ఉన్నాడు. "కాగా యెహోవా తన సేవకులైన ప్రవక్తల ద్వారా ఈలాగు సెలవిచ్చెను - యూదా రాజైన మనష్షే ఈ హేయ కార్యములు చేసి, తనకు ముందున్న అమోరీయులను మించిన చెడునడత కనుపరచి, తాను పెట్టుకొనిన విగ్రహముల వలన యూదావారు పాపము చేయుటకు కారకుడాయెను" (2 రాజులు 21 : 10,11). తాను దారి తప్పుటయే కాకుండా యావత్ యూదాదేశము దారితప్పి, దేవుని విడిచి తిరగటానికి మనష్షే కారణమయ్యాడు. ఇది విచిత్రమైన సంగతి. ఇశ్రాయేలు రాజైన యెరోబాముకూడ ఇశ్రాయేలు దేశప్రజలు పాపముచేయటానికి పరోక్ష కారణమయ్యాడు (1 రాజులు 16 : 19). తాము దారితప్పటమే పెద్దతప్పు, అలా దారితప్పి తిరిగే ఆయా విభాగాలకు చెందిన క్రైస్తవులు తమ తప్పులను సమర్థించుకోవటానికి మరి కొందరిని కుయుక్తిగా వారి దారిలోకి లాగి తమకంటూ ఓ గుంపును పోగుచేసుకొని చెలామణౌతున్నారు. అంటే తప్పుచేసేవారికి, వారిననుసరించే అమాయకపు గుంపు అండ..!! ?? ఇట్టివి క్రైస్తవ కుటుంబాలలో, సంఘాలలో మరియు సంస్థలలో జరుగటానికి వీల్లేదు. అట్టి కుయుక్తి పన్నాగములను గమనించి దేవుని పక్షముగా నిలిచేవారు, నిలుస్తున్నవారు ధన్యులు.

అంతేగాకుండా దేవుడు ఖరాఖండిగా చెప్పిన కొన్ని నియమాలను తుంగలోతొక్కి, తానే జ్ఞానినన్నట్లు బహుమూర్ఖంగా మనష్షే వ్యవహరించాడు. "బెన్‌హిన్నోము లోయయందు అతడు తన కుమారులను అగ్ని గుండములోగుండ దాటించి, ముహూర్తములను విచారించుచు, మంత్రములను చిల్లంగితనమును వాడుకచేయు కర్ణపిశాచములతోను సోదెగాండ్రతోనూ సాంగత్యము చేయుచు యెహోవా దృష్టికి బహుగా చెడునడత నడచుచు ఆయనకు కోపము పుట్టించెను (2 దిన. 33 : 6,8). ఇంతకు ముందు అంత ప్రభలములేని అనవసర, దైవవిరుద్ధ వాడుకలను ఆధిక్యతగా, అనవసరంగా వాడుకచేయటం, ఇతని లోని భ్రష్టత్వానికి నిదర్శనం. భ్రష్టమనస్కులకు వివేకం ఉండదు. కారణం వారు వారి స్వాధీనంలో లేరు. పరాధీనంలో ఉన్నందున మన-తన, మంచి-చెడు, ఆడ-మగ, పెద్ద-చిన్న, దేవుడు-దయ్యం, చీకటి-వెలుగు ఇలాంటి బేధములను సరిగా విభాగించి చూడలేరు. ఇది వారి అంధ విశ్వాసానికి సూచన.

ద్వితి. 18 : 9-11 - "నీ దేవుడైన యెహోవా నీకిచ్చుచున్న దేశమున నీవు ప్రవేశించిన తరువాత ఆజనముల హేయకృత్యములను నీవు చేయ నేర్చుకొనకూడదు. తన కుమారునైననూ తన కుమార్తెనైననూ అగ్నిగుండము దాటించువానినైననూ, శకునముచెప్పు సోదెగానినైననూ, మేఘశకునములనుగాని, సర్ప శకునములనుగాని చెప్పువానినైననూ, చిల్లంగి వానినైననూ,

మాంత్రికునినైననూ, ఇంద్రజాలికునినైననూ, కర్ణపిశాచినడుగువానినైననూ, దయ్యముల యొద్ద విచారణచేయు వానినైననూ మీమధ్య ఉండనియ్యకూడదు". దేవుడు నిఖ్ఖచ్చిగా చెప్పిన, దైవ విరుద్ధమైన సంగతులను తూలనాడి, తనకిష్టమైన పద్ధతిలో మనష్షే బరితెగించి ప్రజలను పాలించటం నిజంగా దుర్మార్గం. ఈరోజుల్లో కూడా చాలామంది క్రైస్తవులనబడి, ఆయావిభాగాలలో పెద్దలుగా కొనసాగుతున్నవారు, బైబిలును బోధిస్తూ, వారి వ్యక్తిగత ప్రతిష్ట, లబ్ధి కొరకు రకరకాలైన బోధలు చేస్తున్నారు. వారి సంఘము వారి ఇష్టమన్నట్లు ప్రవర్తిస్తూ పరోక్షంగా పైన ప్రస్తావించిన దైవవిరుద్ధమైన సంగతులను, మరో పేరుతో నిర్లజ్జగా జరిగిస్తు న్నారు. మర్మముల పేరుతో ప్రజలను మభ్యపెట్టి, మోసగించి రకరకాల ప్రయోజనాలు పొందుతూ, దైవవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. నిస్సందేహంగా కొంతమంది దేవుని పేరుతో దయ్యపు సేవలు చేస్తున్నారు. ఎంతసేపూ వారి వ్యక్తిగత ప్రదర్శన, ఢాంబిక జీవనవిధానము తప్ప లేఖన పరిజ్ఞానం శూన్యం, ప్రజలను మభ్యపెట్టి వారినుండి పొందుకొనవలసినవాటిని పొందుకొంటూ పబ్బం గడుపుకుంటున్నారు. నిస్వార్థ దైవసేవకులు, నాయకులు హెచ్చరించినా వరుస మార్చుకోకుండా ఎదురుదాడిచేస్తూ అహంకారపూరిత ధోరణి కనుపరుస్తున్నారు. ఎవరుపడితే వారు, ఎక్కడపడితే అక్కడ దేవునిసేవ పేరుతో అవసరము లేనిచోటకూడా అనవసరముగా సంఘములను ఏర్పాటుచేసి అప్పటికే సంఘములలో స్థిరపడిన విశ్వాసులను గలిబిలి చేస్తూ, ఏదో ఒక ఆకర్షణతో వారిని అస్థిరపరుస్తున్నారు. అట్టి సంఘములను నడిపించువారిలో అనేకులకు సరియైన బోధ తెలియదు, ప్రజల బాధలను అర్థంచేసుకోరు. దానికి ఒక ప్రధాన కారణం బోధించటానికి తగిన వయస్సు, అనుభవం మరియు తర్ఫీదు లేకపోవటం. అట్టివారికి వ్యక్తిగత ప్రదర్శన మరియు ప్రజలలో గుర్తింపు తప్ప భారం, బాధ్యత లేదు. ఆదివారం ఆరాధనలు, వారం మధ్యలో ఆయా పేర్లతో జరిగే కొన్ని కార్యక్రమాలు కొంతమందికి ప్రభువు దగ్గరకు నడిపించాలనే భారం కంటే, సేవ పేరుతో ఏదో ఒక కార్యక్రమం జరిపించి తమ ఉనికిని చాటుకోవాలనే ఆత్రం ఎక్కువ. దేవుడు పిలిచి అప్పగించిన సేవా బాధ్యతలను పరిరక్షించ కుండా అంతా నాకే కావాలన్నట్లు సేవ విస్తరణ పేరుతో రకరకాల పద్ధతులను అనుసరించటం విడ్డూరం..!!? ఇది మనష్షే తత్వం. అట్టివారు మారుమనస్సు పొందాలి... (2 తిమోతి 3 : 1-3).

యెహోవా మనష్షేకు వర్తమానము పంపిననూ, మాట విననందున "అష్షూరు రాజు యొక్క సైన్యాధిపతులను... మనష్షే తప్పించుకొనిపోకుండ, వారతనిని పట్టుకొని గొలుసులతో బంధించి అతనిని బబులోనుకు తీసుకొనిపోయిరి" (2 దిన. 33 : 11). ఇది మనష్షే స్వయంకృతాపరాధం.

ఎవరుచెప్పినా, దేవుడు ప్రవక్తలద్వారా హెచ్చరించినా వినని మనష్షేను అష్షూరురాజైన సన్హెరీబు బంధించాడు. పైగా గొలుసులతో బంధించాడు. పొరపాటున తప్పించుకోవటానికి కూడ వీల్లేదు..!! అసలు విషయాన్ని మనష్షే యింతవరకు తెచ్చుకోవలసిన అవసరమేమున్నది?

కేవలం గర్వ, భ్రష్ట హృదయం. దేవుడనుగ్రహించిన రాజ్యాధికారం, దైవబహుమానమని భావించక విర్రవీగి బంధీయయ్యాడు. దేవుడనుగ్రహించిన ఆ కుటుంబమైనా, ఆస్తియైనా, ఆరోగ్యమైనా, సంఘమైనా మరియు మరేదైనా బహు జాగ్రత్తగా భక్తిప్రపత్తులతో పరిరక్షించాలే తప్ప అనవసర, అసందర్భ డాంభికాలతో కాదు. దేవుని మాటను ఎంతటివారైనా వినాలి. విని జీవితంలో సవరణలు చేసుకోవాలి. ఒకవైపు అసంపూర్ణులమంటూనే పరిపూర్ణులన్నట్లు వ్యవహరించరాదు. తప్పులొప్పుకుంటూనే తప్పులలో కొనసాగరాదు. మాటలలో తగ్గించుకుంటూ చేతలలో గొప్పవారమన్నట్లు భావింపతగదు. వీటిని అందరూ ఆలోచించాలి. అవసరతను బట్టి సవరించుకోవాలి.

మనష్షే బబులోను దేశమునకు బానిసగా వెళ్ళిపోయాడు (ఆకాలములో బబులోను అష్షూరీయుల ఆధీనములో ఉన్నది). 2 దిన. 33 : 12 - "అతడు శ్రమలో ఉన్నప్పుడు తన దేవుడైన యెహోవాను బతిమాలుకొని, తన పితరుల దేవుని సన్నిధిని తనను తాను బహుగా తగ్గించుకొని ఆయనకు మొరపెట్టాడు". మొత్తానికి బబులోను దేశానికి బానిసగా వెళ్ళిన తరువాత ఎవరూ చెప్పకుండానే మనష్షేకు ప్రార్థన చేయటం వచ్చింది! కొంతమందికి అన్నీ బాగున్నప్పుడు దేవుడు గుర్తురాడు, సంఘం అంతకంటే గుర్తురాదు. మనమేమి చెప్పినా ఏదోఒక సాకుచెప్పి తమకు అస్సలు తీరికలేదన్నట్లు చెప్పకనే చెబుతారు. వాళ్ళు మనష్షే తత్వ సంబంధీకులు. అట్టివారికి మామూలుగా ఉన్నప్పుడు ప్రార్థనరాదు, వినయ విశ్వాసాలు రావు, మందిరానికి క్రమంగారారు, కష్టంవచ్చినప్పుడే ప్రార్థన, సంఘం, పాస్టరుగారు గుర్తొస్తారు..!! చాలా విచిత్రం. అంతవరకు తెచ్చుకోనక్కర్లేదు. అయినా ఎందుకో కొంతమంది వినరు.

ప్రవక్తయైన యోనా కూడా చేపకడుపులో ఉన్నప్పుడు భలే ప్రార్థన చేయాలనిపించింది. అంతకు ముందు, దేవుడు ఎన్నిమార్లు చెప్పజూచినా వినలేదు. చేపకడుపులో ఉన్నప్పుడు గంభీరమైన ప్రార్థన చేశాడు (యోనా 2 : 1-10). తన తప్పులు ఒప్పుకున్నాడు. దేవుని సంగతులను, ఆలోచనలను గ్రహించాడు. ఇది ఒకరకంగా అభినందించవలసిన సంగతి. ఎందుకనగా వారు చేసిన తప్పును ఒప్పుకొని, దానిని విడిచిపెట్టి మనష్షే, యోనాలు వినయ, విశ్వాసాలతో ప్రార్థించారు. దేవుడు అట్టివారి ప్రార్థననూ విన్నాడు.

2 దిన. 33 : 13 - "... అతని విన్నపములను ఆలకించి యెరూషలేమునకు అతని రాజ్యములోనికి అతని తిరిగి తీసుకొని వచ్చినప్పుడు యెహోవా దేవుడైయున్నాడని మనష్షే తెలిసికొనెను". మొత్తానికి మనష్షే మారుమనస్సు పొందాడు. దేవుని సన్నిధిలో తనను తాను తగ్గించుకొని, భ్రష్టత్వాన్ని వదిలి, నిజాయితీగా ప్రార్థించాడు. ఇది అతనిలో కలిగిన గొప్ప ఆధ్యాత్మిక చైతన్యం. ప్రార్థించటం వేరు, తమ్మును తాము తగ్గించుకొని ప్రార్థించటం వేరు. ఈ రెండింటి మధ్యలో ఉన్న వ్యత్యాసం మనష్షే జీవిత పరిశీలన ద్వారా గుర్తించగలం. జీవితంపై ఆశలు సన్నగిల్లిన సమయంలో మనస్ఫూర్తిగా దేవుని ఆశీర్వాదం పొందాడు. తిరిగి తన స్వదేశమునకు రాగలిగాడు. విశ్వాస వినయ, విధేయతలతో ప్రభువుని సేవించి, ప్రభుదీవెనలతో కొనసాగుదాం.

**( సశేషం )**

# సహవాసంలో వాసం

సహోదరి ఎ. ఉషారాణి, అధ్యాపకురాలు, మరనాత బిబ్లికల్ సెమినరి, విజయవాడ

ప్రభువైన క్రీస్తు నామమున మరనాత మెసేంజర్ పాఠకులకు శుభములు. దేవునితో, తోటి వారితో సత్సంబంధం, సహవాసమే క్రైస్తవ్యంలోనున్న గొప్పతనము, ప్రత్యేకత. సహవాసం క్రైస్తవ్యం యొక్క నాడి అని చెప్పవచ్చు. అలనాడు ఆది సంఘము కూడా రొట్టె విరుచుటయందును, సహవాసమందును ఎడతెగక యుండినట్లు బైబిల్ గ్రంథం తెలియచేస్తుంది (అపో॥ కా॥ 2 : 47). కనుకనే దినదినము అనేకులు సంఘములో చేర్చ బడుచూ వచ్చిరి. తోటివారితో సహవాసం చెయ్యవలసిన బాధ్యత మనందరిపైనా ఉంది. రకరకాల వ్యక్తులు వివిధ రీతులలో ఏవిధంగా సహవాసం చేసారో లేఖనాలు స్పష్టంగా తెలియచేస్తున్నాయి. ఇలా సహవాసం, సత్సంబంధం కలిగియుండుట వలన మనమెలా దీవించబడతామో, దీవెనకు ఏవిధంగా పాత్రులమౌతామో లేఖనాల నుండి పరిశీలిద్దాం.

**1. సహవాసం భారంమోసేదైయుండాలి :-** యేసుక్రీస్తు భూలోకములో పరిచర్య చేస్తున్న సమయంలో ఆయన తన శిష్యులతో కూడ యెరూషలేమును దర్శించక మునుపు సమరయలో బసచేయవలెనని తలంచెను. అందుకుగాను తనకు సమరయలో బస సిద్ధముచేయవలెనని శిష్యులను కోరెను. అయితే యేసును చేర్చుకొనుటకు సమరయ గ్రామస్థులు ఒప్పుకొనలేదు. అందుకుగాను యాకోబు యోహానులు భావోద్రేకపూరితంగా ప్రతిస్పందించారు (లూకా 9 : 53-55). మానవుల సంరక్షణార్థం నరావతారిగా భూలోకానికి ఏతెంచిన యేసుక్రీస్తు ముందు తమకు, సమరయులకు మధ్యనున్న విరోధభావాలను వెళ్ళగ్రక్కారు. అగ్ని ఆకాశం నుండి దిగివచ్చి సమరయులను నాశనము చెయ్యాలని కోరారు. అగ్నిని ఆకాశమునుండి తీసుకురాగల సామర్థ్యమే కనుక నిజంగా ఈ శిష్యులకు ఉండిఉంటే అలా మాట్లాడేవారేకాదు. యేసు చేసిన అద్భుత కార్యాలను, సూచక క్రియలను కళ్ళతో చూచారు. తమతో యేసు ఉన్నాడనే అహంభావాన్ని ప్రదర్శించారేతప్ప వాస్తవానికి యేసును తమలో కలిగి ఉన్నట్లుగా ప్రవర్తించలేదు. యేసులోని ప్రేమ, ఆదరణ, ఓర్పు ఏమాత్రం వీరిలో కన్పించలేదు. 'తన ప్రజలను వారి పాపములనుండి ఆయనే రక్షించును' (మత్తయి 1 : 21). రక్షించే యేసును భక్షించే నాయకునిగా తయారు చేయటానికి ప్రయత్నించారు ఈ యౌవ్వన శిష్యులు.

ఈ నామాటలు మీ చెవులలో నాటనియ్యుడి, నన్ను చేర్చుకొనువాడు, నన్ను పంపిన వానిని చేర్చుకొనును (లూకా 9 : 44, 48) అనే యేసు మాటలను ఈ శిష్యులు తమ తొందరపాటు వలన పెడచెవిని పెట్టారు. అప్పటికే సమరయులు యూదులవలన జాతి పరమైన ఇబ్బందులను ఎదుర్కొంటూనే ఉన్నారు. వారికి స్వంతంత్ర హక్కులు ఏమాత్రం

లేవు. అప్పటికే మోడుబారిన సమరయ జీవితాలను సేదదీర్చి వారికి ఊరట కల్గించటానికి బదులుగా వారిని దహింపచెయ్యాలని, నాశనం చెయ్యాలనుకోవటం శోచనీయం. ఈ లోకభారాన్ని మోయవలసిన శిష్యగణం మరింత భారంపెట్టి మనుష్యులను కృంగదీసేవారిలా వ్యవహరించారు. క్రీస్తును ఎరిగిన ప్రజలముగా మనము లోకంమీద భారం పెట్టేవారిగా ఉండుటకు యేసు మనలను పిలువలేదు. భారంతో అలసిపోతున్నవారి బరువును దించి వారు క్రీస్తు సంఘమనే ఒడిలో సేదదీర్చుకొనుటకు అవకాశం కల్పించవలసిన వారమైయున్నాము. అందుకే యేసు ప్రయాసపడి భారము మోయుచున్న సమస్త జనులారా నాయొద్దకు రండి, నేను మీకు విశ్రాంతి కలుగజేతును అని చెప్పాడు (మత్తయి 11 : 28). భారం లేని మనము యితరుల బరువు దించటానికి ప్రయత్నం చెయ్యాలి. ఆ బాధ్యత క్రైస్తవులమైన మనందరిపైనా ఉంది.

**2. సహవాసం బరువు దించేదైయుండాలి :-** యెరూషలేములోని సంఘమునకు గొప్ప హింస కలిగినందున సంఘమంతా చెదిరిపోయింది. అయితే చెదిరిపోయిన వారంతా సువార్త ప్రకటించుచూ సంచారము చేసిన సమయమున సువార్తికుడైన ఫిలిప్పు సమరయకు వచ్చి క్రీస్తును గూర్చి ప్రకటించటం ఆరంభించాడు. అపో॥ కా॥ 6వ అధ్యాయంలో ఎన్నుకోబడిన ఏడుగురిలో ఒకడు ఈ ఫిలిప్పు. అయితే ఫిలిప్పు క్రీస్తు యొక్క గొప్పతనాన్ని ప్రకటించిన వెంటనే గొప్ప ఆనందం సమరయలో వెల్లివిరిసింది. అపవిత్రాత్మలు వదలిపోవటం, స్వస్థతలు పొందుకోవటం, యేసును చేర్చుకోవటం వలన ఆ ప్రాంతంలో మిగుల సంతోషము కలిగెను (అపో॥ కా॥ 8 : 5-8). అక్కడితో సమరయులు ఆగిపోలేదు కాని దేవుని ఆత్మశక్తిని వారి జీవితాలలో అనుభవించారు. శక్తివిహీనులుగా ఎంచబడిన ఈ ప్రజలు నిజశక్తిని పొందకొని ఆనందించారు. జాతిహక్కులు లేని ఈ ప్రజలు తాము పరలోక పౌరులుగా హక్కులు పొందామని సంబరపడ్డారు.

అయితే ఏ యోహానైతే అగ్ని ఆకాశమునుండి దిగివచ్చి వీరిని దహించాలని కోరుకున్నాడో ఆ యోహానే సమరయులకు బాసటగా నిలిచాడు. యోహాను కోరుకున్న అగ్ని మనుష్యులను నాశనంచేసేది కాని దేవుడు పంపిన ఈ అగ్ని జీవింపచేసేది. అందుకే దేవుడు యోహాను కోరుకున్న అగ్నికాక తాను కోరుకున్న అగ్నిని యోహానునే మధ్యవర్తిగా వినియోగించుకొని సమరయులకు అనుగ్రహించాడు. యెరూషలేములో శ్రమ, హింస వచ్చినందున ఫిలిప్పు ఆ పట్టణాన్ని విడిచిపెట్టాల్సి వచ్చింది. అయితే తాను శ్రమలో ఉన్నానని కృంగిపోకుండా తనమీదనున్న బరువును చూసుకుంటూ నిరుత్సాహపడలేదుకాని అందుకు భిన్నంగా బరువుతో, భారంతో కృంగిపోతున్న సమరయులకు చేయూతను అందించాడు. తనకంటే ఎక్కువగా, తనను పంపిన దేవుని పనిని ప్రథమంగా ఎంచుకున్నాడు. అందుకే సమరయుల సంతోషానికి కారకుడయ్యాడు. మనకున్న క్షణికమైన

ఇబ్బందులు, బాధలు పట్టించుకొనక మనలను పిలిచిన దేవుని పనిని ఎవరైతే సక్రమంగా నెరవేరుస్తారో వారిని చూచి దేవుడు తప్పక సంతోషపడతాడు. అంతేకాక మనద్వారా సంతోషాన్ని, ఆనందాన్ని ప్రజలకు అందిస్తాడు. అయితే ఫిలిప్పు తరువాత పరిచర్య ఎలా కొనసాగిందో ఎవరు కొనసాగించారో మనకు తెలియదు. ఎందుకంటే ఫిలిప్పు తరువాతి కాలంలో కైసరయలో నివసించాడు.

**3. సహవాసం భరోసానిచ్చేదైయుండాలి :-** నరరూపధారిగా భూలోకానికి విచ్చేసిన యేసుక్రీస్తు ఎండవేళ అలసిపోతూ సమరయలోనున్న సుఖారు అను గ్రామాన్ని దర్శించాడు. అయితే యేసు దాహముగొనియున్న సమయాన ఒక సమరయ స్త్రీ నీళ్ళు చేదుకొనుటకు యేసు కూర్చున్న బావిదగ్గరకు వచ్చింది. యేసు దాహమునకిమ్మని ఆ స్త్రీని అడిగిన వెంటనే యూదునిగా, పరాయి వానిగా యేసును ఎంచింది. యేసు తానెవరో పరిచయం చేసుకున్న తరువాత ప్రవక్తగా, ప్రభువుగా ఆతరువాత పరమ బంధువుగా గుర్తించింది. తన కుటుంబ జీవితంలో ఉన్న లోపాలను ఎత్తిచూపి వాటికి పరిష్కార మార్గాన్ని చూపించినందుకు యేసును ప్రభువుగా తన హృదయంలో చేర్చుకుంది. అస్తవ్యస్తమైన తన బ్రతుకును మార్చిన ప్రభువుకు సాక్షిగా మారింది. సాక్షాత్తు మెస్సియానే తనముందు సాక్షాత్కరిస్తే తాను ఆయనను హృదయంలో చేర్చుకోకుండా ఉండలేకపోయింది. తనలో బరువంతా తొలగిపోగా, తేలిక హృదయంతో పరుగెత్తుకుంటూ ఊరిలోకి వెళ్ళింది. తన బరువు దిగిపోగానే తాను ఎంత హాయిగా, ప్రశాంతంగా ఉన్నదో చూచుకొని ఊరుకోలేదు కాని తనలా బరువు మోస్తున్న ఊరు గుర్తొచ్చింది. స్వార్థాన్ని వదలి సువార్త భేరి మ్రోగించింది. బరువులుదించి భరోసానిచ్చే యేసును గ్రామానికి పరిచయం చేసింది. ఆ స్త్రీ చేసిన పరిచయంతో ఆ ప్రాంతం అంతా యేసును బంధువుగా ఎంచుకొని తమయొద్ద ఉండుమని యేసును వేడుకొన్నారు (యోహాను 4 : 40). యేసు సమరయ స్త్రీ యొక్క బరువును తీసివేయుటయే కాదుకాని, యితరుల బరువులు దించగల్గిన గొప్ప నాయకురాలిగా ఆమెను తయారుచేశాడు. తమకే దేవుడు చెందుతాడనుకొన్న యూదుల ఆలోచనలను పడగొడ్తూ యేసు అందరికి చెందిన దేవుడనని సమరయకు వెళ్ళి నిరూపించుకున్నాడు. క్రీస్తుచే పిలువబడిన మనము కూడా బరువులు దించేవారిగానే కాక, బరువులు దించగల వ్యక్తులను సంపాదించుకొనవలసినవారమై యున్నాము. అందు నిమిత్తము మనము అందరికి చెందినవారిగా ఎంచుకోవాలి. అపో॥ పౌలు కూడా నేను యూదులకు యూదునిగా, అన్యజనులకు అన్యజనుడిగా ఎంచుకొన్నాను అన్నాడు (1 కొరింథి 9 : 21-22).

భారము పెట్టేవారిగా కాక, బరువులు దించటంతోను ఆగిపోక, బరువులను దించే నాయకులను తయారు చేయువారిగా, దేవునికి మధ్యవర్తులుగా ఉండు కృప దేవుడు మనకు అనుగ్రహించును గాక. **- మరనాత.**

# ఎఫెసీయులకు వ్రాసిన పత్రిక

## ( 13 వ భాగము )

రెవ. అల్లూరి. విశ్వప్రసాద్, విజయవాడ

## వెలుగులో నడుచుట : (ఎఫెసీ 5 : 1-6)

**పాఠకులకు ప్రభువైన యేసుక్రీస్తు నామములో వందనములు శుభములు !**

ఎఫెసీ పత్రిక 4, 5 అధ్యాయములలో క్రైస్తవుల నడవడి లేక జీవిత విధానము ఎలా ఉండాలో చాలా స్పష్టంగా వ్రాయబడిఉంది. **4 : 1-16 లో ఒక విశ్వాసిగ, దైవసేవకునిగా మనం పొరుగువారితో, తోటి విశ్వాసులతో, సేవకులతో ఐక్యత కలిగి నడుచుకోవాలని, 4 : 17-32 లో విశ్వాసులైనవారు అన్యజనులు (అవిశ్వాసులు) వలెకాక పరిశుద్ధతలో నడుచుకోవాలని, 5 : 1-6 లో దేవుని ప్రేమనుగూర్చి, మనం ప్రేమలో నడుచుకోవాలని** నేర్చుకొన్నాం. ఈ మాసములో **5 : 8-14 లో నుండి 'వెలుగైయున్న దేవుని పిల్లలవలె' మనం ఏవిధంగా నడుచుకోవాలి అనే అంశమునుగూర్చి నేర్చుకొందాం.**

**"మీరు పూర్వమందు చీకటియై యుంటిరి, ఇప్పుడైతే ప్రభువునందు వెలుగైయున్నారు. వెలుగు ఫలము సమస్తవిధములైన మంచితనము, నీతి, సత్యమను వాటిలో కనబడుచున్నది" (5 : 8,9).** దేవుని పిల్లలమైన మనము వెలుగు సంబంధులం, వెలుగు ఫలము మనలో ఉండాలి అని ఈ లేఖనభాగంలో తెలియుచున్నది. "నీతికి దుర్నీతితో ఏమి సాంగత్యము? వెలుగునకు చీకటితో ఏమి పొత్తు?" (2 కొరింథి 6 : 14). గనుక "దేవుని భయముతో పరిశుద్ధతను సంపూర్తి చేసికొనుచు, శరీరమునకును ఆత్మకును కలిగిన సమస్త కల్మషము నుండి మనలను పవిత్రులనుగా చేసికొందము." (1 కొరింథి 7 : 1). మీరు పూర్వమందు చీకటియైయున్నారు. ఇప్పుడు వెలుగుసంబంధులు. రక్షణ పొందినవారు సైతం చీకటి సంబంధమైన కార్యాలలోనే కొనసాగుతున్నట్లయితే ఆ స్థితిలోనుంచి మీరు వెలుగులోనికి రావాలి. ఈ వెలుగు ఫలమునిస్తుంది. అది మంచితనము, నీతి, సత్యమను వాటిలో కనబడుచున్నదని దైవ లేఖనాలు తెలియజేస్తున్నాయి.

**చీకటి లేక పాపమును గూర్చి :-** చీకటిని పారద్రోలడం ఒక్క వెలుగునకే సాధ్యం. చీకటి, చీకటిని ఎప్పుడూ పారద్రోలలేదు. చెడ్డవారు అదేవిధమైన చెడుతనంలో ఉన్నవారికి నీతులు చెప్పలేరు, చెప్పినా వినరు. మనం మంచివాళ్లమయితేనే మనం చెప్పే మాటలను అంగీకరిస్తారు. అవిధేయులు అనగా చీకటిలో నడుచువారు నడుచునట్లుగ మీరు నడువ వద్దు. ఇట్టి పాపపు క్రియలవలన దేవుని ఉగ్రత అవిధేయులైనవారి మీదికి వచ్చును గనుక మీరు పాపులతో అనగా చీకటి సంబంధులతో పాలివారై యుండకుడి (ఎఫెసి 5 : 7). అట్టివారు దేవుని రాజ్యానికి వారసులు కారు. చీకటిని పాపముతోను, ఆజ్ఞాతిక్రమము

(దేవుని వాక్యమును వినకపోవడము, ధ్యానించకపోవడము, వాక్యానుసారంగా జీవించకపోవటము)తోను పోల్చుతున్నారు. చీకటిలో ఉన్నవారు ఆధ్యాత్మిక మత్తులో ఉన్నారు, మరణమునకు లోనై ఉన్నారు. అవిశ్వాసముతో నిండియున్న ఈ లోకమును కూడ చీకటితో పోల్చుతున్నారు. చీకటిలోకములో మనము క్రీస్తు వెలుగై ప్రకాశించాలి. వెలుగు సంబంధుల ముగా లోకములో ఉన్నవారియొద్దకు మనము వెళ్లినప్పుడు వారిలోఉన్న చీకటిక్రియలు, బలహీనతలు పోవాలి.

**దేవుని వెలుగును గూర్చి :-** వెలుగు దేవుని యొక్క గుణలక్షణం, స్వభావమై అది నీతిని చూపిస్తుంది. వెలుగును దేవుని యొక్క పవిత్రతతో, సత్యముతోను, మేల్కొలుపుతోను పోల్చుతున్నారు. వెలుగు జీవమును, ఉజ్జీవాన్ని తీసుకొస్తుంది. దేవుని యొక్క జ్ఞానమును, తెలివిని చూపిస్తుంది. వెలుగుతో పోల్చబడిన వాక్యమును దేవుడు మనకనుగ్రహించాడు, ఇది అనేక మందిని వెలిగిస్తుంది. **"ఆ వెలుగు చీకటిలో ప్రకాశించుచున్నది గాని చీకటి దాని గ్రహింపకుండెను" (యోహాను 1 : 5). "వెలుగు లోకములోనికి వచ్చెను గాని తమ క్రియలు చెడ్డవైనందున మనుష్యులు వెలుగును ప్రేమింపక చీకటినే ప్రేమిస్తున్నారు" (యోహాను 3 : 19). "యేసు - నేను లోకమునకు వెలుగును, నన్ను వెంబడించువాడు చీకటిలో నడువక జీవపు వెలుగు కలిగియుండునని వారితో చెప్పెను" (యోహాను 8 : 12).** "వారు చీకటిలో నుండి వెలుగులోనికిని, సాతాను అధికారమునుండి దేవుని వైపుకును తిరిగి, నాయందలి విశ్వాసము చేత పాపక్షమాపణను, పరిశుద్ధపరచబడినవారిలో స్వాస్థ్యమును పొందునట్లు వారి కన్నులు తెరచుటకై నేను నిన్ను వారియొద్దకు పంపెదనని చెప్పెను" (అపో॥ కా॥ 26 : 18). "మీరందరును వెలుగు సంబంధులును పగటి సంబంధులునై యున్నారు; మనము రాత్రివారము కాము, చీకటివారము కాము" (1 థెస్స 5 : 5). "అయితే మీరు చీకటిలోనుండి ఆశ్చర్యకరమైన తన వెలుగులోనికి మిమ్మును పిలిచినవాని గుణాతిశయములను ప్రచురము చేయు నిమిత్తము.." (1 పేతురు 2 : 9). "ఆ వాక్యము చీకటిగల చోటున వెలుగిచ్చు దీపమైనట్లున్నది; దానియందు మీరు లక్ష్యముంచినయెడల మీకు మేలు"(2 పేతురు 1 : 19). "నీ వాక్యము నాపాదములకు దీపమును నాత్రోవకు వెలుగునైయున్నది" (కీర్తన 119 : 105). కనుక - **"వెలుగులో ఉన్నానని చెప్పుకొనుచు తన సహోదరుని ద్వేషించువాడు ఇప్పటివరకు చీకటిలోనే ఉన్నాడు" (1 యోహాను 2 : 9).** అందుచేత మనలో దేవునికి అయిష్టమైన వాటిని తీసివేసుకోవాలి.

విశ్వాసులైన మీరు అవిశ్వాసులతో జోడిగా ఉండకండి. నీతికి దుర్నీతితో ఏమి సాంగత్యము, వెలుగుకు చీకటితో ఏమి పొత్తు అని లేఖనము తెలియజేయుచున్నది. మరి ఒక విశ్వాసికి అవిశ్వాసియైన భర్తగాని, అవిశ్వాసియైన భార్యగాని ఉన్నప్పుడు వారు చేసే చెడ్డపనులు, చీకటిపనులు, పాపపు పనులు చెయ్యకూడదు అంటే వారితో జోడిగా ఉండకూడదు అని. అంతేగాని అటువంటి భర్తలను, భార్యలను విడిచిపెట్టమనికాదు.

విశ్వాసియైన భార్య తన నడవడికవల్ల అవిశ్వాసియైన తన భర్తను మార్చుకోవచ్చు అంటున్నాడు. స్నేహితులులోను రకరకాల వాళ్లు ఉంటారు. వాళ్లతో స్నేహం వరకేగాని, వాళ్లు చేసే దైవ లేఖనాలకు వ్యతిరేఖమైన కార్యక్రమాలలో మనం ఎన్నడూ పాల్గొనరాదు.

"దేవుని ఆలయమునకు విగ్రహములతో ఏమి పొందిక? మనము జీవముగల దేవుని ఆలయమై యున్నాము; నేను వారిలో నివసించి సంచరింతును, నేను వారి దేవుడనై యుందును వారు నా ప్రజలైయుందురు."(2 కొరింథి 6 : 16). ఈ భాగములో విశ్వాసియొక్క స్వభావము ఎలా ఉండాలో చెబుతున్నాడు. **ఉదాహరణకు:** ప్రతి జంతువుకి ఒక్కోస్వభావము ఉంటుంది. గొఱ్ఱెకు సాధు స్వభావము, తోడేలుకు క్రూర స్వభావము ఉంటుంది. విశ్వాసులమైన మనలో ఒకప్పుడు పాత, చీకటి, చెడు స్వభావము ఉంది. కాని దేవుని విశ్వసించి, ఆత్మరక్షణ పొందుకొని, దేవుని సేవిస్తుండగా మన పూర్వపు స్వభావము నుంచి విడిపించి దైవికమైన స్వభావము, ఆత్మనడిపింపును మనకనుగ్రహిస్తున్నాడు. "దేవుడు మనకు అమూల్యములును, అత్యధికములైన వాగ్ధానముల ననుగ్రహించియున్నాడు. దురాశననుసరించుట వలన లోకమునందు భ్రష్టత్వము ఈ వాగ్ధాన మూలముగా మీరు తప్పించుకొని దేవ స్వభావమునందు పాలివారగునట్లు వాటిని అనుగ్రహించెను" (2 పేతురు 1 : 3,4). దేవుని ఆత్మానుసారముగా జీవిస్తూ మనము దేవుని సంతోషపరచాలి.

వివాహమందు ఇరువురు వ్యక్తులు జతపర్చబడునప్పుడు వారి బాహ్యమైన రూపముకన్నా, రెండు వేర్వేరు స్వభావాలు గలిగిప వారి మనసులు కలవడం ప్రాముఖ్యం. వారు ఒప్పుకున్నందున పెళ్లిచేసారు, కాని మనసులు కలవడంలేదు, ఎంతచెప్పిన వినడంలేదు, విడాకులు తీసుకుందామని తీసేసుకుంటారు. అనారోగ్యం ఉంది, పిల్లలు పుట్టలేదు, చెప్పినమాట వినడములేదు కాబట్టి విడాకులు ఇచ్చేస్తానంటే అది దేవుని వాక్య విరుద్ధము. వ్యభిచార (వివాహేతర సంబంధాలు) కారణమును బట్టికాక మరి ఏవిషయం గురించియైన విడిపోవుటను దేవుని వాక్యము ఖండిస్తున్నది.

భార్యభర్తలైనవారు ఒకరు విశ్వాసియై, మరొకరు అవిశ్వాసియైనచో వారితో విభేదించి ఉండవద్దు. అట్టివారిపట్ల సహసనముతో, సమాధానము కలిగిఉంటూ వివాహ ఒప్పందానికి విలువతెచ్చే వారైయుండాలి. అది వెలుగు సంబంధులు చేసేపని. దేవుని ప్రజలైన మనము ఇంట్లో మనం ఎలా సర్దుకొంటున్నామో, దేవుని సేవలో అలాగే సర్దుకుపోవాలి. నాకు ఇల్లు, సంఘము రెండు కళ్లలా ఉంటాయి. రెండూ చాలా బలమైనవిగా అనిపిస్తుంది. రక్షించబడి, బాప్తిస్మము పొంది, సంఘములో క్రమంగా ఉండటం నేర్చుకున్నవారు వారి ఇంటిని కూడ చాలా జాగ్రత్తగా కట్టుకోగలుగుతారు. అలాంటి కలసిఉండే కుటుంబాలే సంఘములో సహకారులుగా ఉండగలుగుతారు. మనము దేవుని సహవాసములో ఐక్యతగా ఉండాలి.

క్రైస్తవ జీవితము చాలా ప్రాముఖ్యమైనది. ఇది వివాహముతో పోల్చబడినది. ప్రదానము ఒక ఒడంబడిక అయితే, వివాహము ద్వారా అది సంబంధమవుతుంది, అలాగే ప్రభువును అంగీకరించిన మనము క్రీస్తుకు ప్రదానము (ఒడంబడిక) చేయబడ్డాము, ప్రభువును స్వంత రక్షకునిగా అంగీకరించడం ద్వారా ఆయన సంఘములో చేర్చబడాము. వరుడు క్రీస్తు కాగా, ఆయన సంఘము వధువుతో పోల్చబడినది. యేసయ్య రెండవరాకడలో ప్రభువుతో సంఘము ఐక్యపరచబడుతుంది. మధ్యాకాశములో పెండ్లివిందు జరుగుతుంది.

లోక మర్యాదననుసరిస్తూ, దేవుని వాక్యానుసారముగా మనం నడువడం అసాధ్యం. కాబట్టి దేవునిని విడిచి పెట్టడము కంటే లోకాశలను విడిచిపెట్టటమే మేలు. అపవాదితోను, చీకటితోను స్నేహాన్ని విడిచి దేవుని యందున్న విశ్వాసములో మనము ముందుకు సాగిపోవాలి. అన్యులను ప్రభువుదగ్గరకు నడిపించటానికి ప్రయత్నం చెయ్యాలి. వారు మన భక్తిని చాలా పరిశీలిస్తారు. మనలో మార్పు కనబకుండా ఎంత సహవాసం చేసినా, ఎదుటివారిలో మార్పుకోరుకోవడం హాస్యాస్పదం. నువ్వు దేవుని ఎరుగకముందు ఉన్న పాపపుస్థితి ఇప్పుడు రక్షించబడిన తరువాత ఉండటానికి వీలులేదు. అపవిత్రతకు ఎప్పుడూ దూరంగా ఉండాలి. విశ్వాసి అవిశ్వాసితో వివాహ సంబంధాలు పెట్టుకోకపోవడమే ఒకవిధంగా మంచిది. కారణం అభిప్రాయభేదాలకు తావుండదు. ఒకవేళ ఇప్పటికే వివాహం జరిగిపోయి ఉంటే, నీ విశ్వాసం అంత గొప్పదైతే, వెలుగు ఫలమైన మంచితనముతో నీ భార్య లేక భర్తను దేవునికొరకు సంపాదించుటకు ప్రయత్నించండి. అందులో ఎంతో వ్యతిరేకత, కష్టం ఉంటుంది. అవిశ్వాసులను వివాహాలు చేసుకొని వారిని దేవుని కొరకు సంపాదించిన వారున్నారు. అట్టివారిని బట్టి దేవునికి స్తోత్రం కలుగును గాక! అదే సందర్భములో ఇబ్బంది పడుతున్నవాళ్లు ఉన్నారు. వారు కుటుంబం విషయములో అద్భుతమైన సహకారం అందిస్తారు, కాని దేవుని విషయంలో వ్యతిరేకతను ప్రదర్శిస్తుంటారు, దేవుని సన్నిధికి రావడానికి సమయం పడుతుంది. అట్టివారి కొరకు ప్రార్థిద్దాం.

**"వెలుగు ఫలము సమస్తవిధములైన మంచితనము, నీతి, సత్యమను వాటిలో కనబడుతున్నది. గనుక ప్రభువుకేది ప్రీతికరమైనదో దానిని పరీక్షించుచు, వెలుగు సంబంధులవలె నడుచుకొనుడి" (ఎఫెసీ 5 : 9).** వెలుగు సంబంధులు క్రీస్తును గూర్చి సాక్ష్యం చెబుతారు. వెలుగులో నడుచుకోని ప్రజలను ప్రభువుకొరకు నడిపించవలసిన బాధ్యత మనమీద ఉన్నది. వెలుగు దేవునిని మాత్రమే ప్రత్యక్ష్యపరుస్తుంది, ఫలమును ఇస్తుంది. చీకటిలో ఉన్న వాటినన్నిటిని బయటకు తీసుకువస్తుంది. దేవునిని ప్రత్యక్ష్యపరచునట్లుగా మనం అట్టి వెలుగైయున్నాము. హెచ్చు కలిగినప్పుడు హెచ్చిపోకుండా కష్టపరిస్థితుల్లో కృంగిపోకుండా అన్ని సమయ సందర్భాలలో దేవుని యొక్క వెలుగులో మీరు నడవాలని పౌలు భక్తుడు తెలియచేస్తున్నాడు. **"నిష్ఫలమైన అంధకార క్రియలలో పాలివారైయుండక**

**వాటిని ఖండించుడి. ఏలయనగా అట్టిక్రియలు చేయువారు రహస్యమందు జరిగించు పరులను గూర్చి మాటలాడుటయైనను అవమానకరమై యున్నది. సమస్తమును ఖండింపబడి వెలుగుచేత ప్రత్యక్షపరచబడును; ప్రత్యక్షపరచునది ఏదో అది వెలుగేగదా. అందుచేత - నిద్రించుచున్న నీవు మేల్కొని మృతులలోనుండి లెమ్ము, క్రీస్తు నీమీద ప్రకాశించునని ఆయన చెప్పుచున్నాడు" (ఎఫెసీ 5 : 11-14).**

**మనం నేర్చుకోవలసినది :-** ఈలోకంలో విశ్వాసికి అవిశ్వాసితో పొత్తు కుదరదు. దేవుని గూర్చిన సంగతులను గ్రహించలేకపోవుటయే పరస్పర అభిప్రాయభేదములు, అనైక్యత, ఈర్ష్య, అసూయలు, పోరాటములు కలుగుటకు కారణం. "సమస్తమును ఖండింపబడి వెలుగు చేత ప్రత్యక్షపరచబడుచున్నది". దేవుని సన్నిధి ప్రత్యక్ష గుడారములోనికి దిగివచ్చింది. అదే సమయములో వెళ్లిపోయిందికూడ. దేవుని యొక్క మహిమ, సన్నిధి వెళ్లిపోవడానికి కారణం ఇశ్రాయేలీయులు పాపముచేసిరి (1 సమూయేలు 4 : 21). పాపము (వ్యభిచారము, దొంగతనము, విగ్రహారాధన మొదలైనవి) ఎక్కడ ఉండునో దేవుని మహిమ అక్కడ ఉండదు. పాపపు ఆలోచనలు మనలో ఉన్నప్పుడు దేవుని అభిషేకం మనపై ఉండదు.

దేవుని మహిమ యేసుక్రీస్తు నామధేయుడుగ ఈ లోకానికి వస్తే, వారు ఆయనను సిలువ వేసారు. ఈనాడు సంఘాలలో దేవుని మహిమ, దేవుని సన్నిధి ఉండుటకు కారణం ఏకమనస్సుతో ఆరాధించేవారు కూడిరావడమే. అయితే సంఘము అనైక్యతతో ఉన్నప్పుడు దేవుని సన్నిధి అక్కడ ఉండదు. వాగ్రూపియైన దేవుని వాక్యములోనున్న ఆయన సన్నిధిని, శక్తి మహత్యములను చూస్తూ ముందుకు సాగిపోదాం. నిద్రించుచున్న నీవు మేల్కొని మృతులలో నుండి లెమ్ము, క్రీస్తు నీమీద ప్రకాశించునని ఆయన చెప్పుచున్నాడు.

వెలుగు సంబంధులమైన మనకున్న మరొక స్వాస్థ్యము - తేజోవాసులైన పరిశుద్ధుల స్వాస్థ్యము. **"తేజోవాసులైన పరిశుద్ధుల స్వాస్థ్యములో పాలివారమగుటకు మనలను పాత్రులనుగా చేసిన తండ్రికి మీరు కృతజ్ఞతాస్తుతులు చెల్లింపవలెననియు దేవుని బతిమాలుచున్నాను" (కొలస్సీ 1 : 12).** మీ జీవితాల్లో ఎటువంటి చీకటిసంబంధమైన ప్రతికూల పరిస్థితులు ఉన్నా "ఆయన మనలను అంధకార సంబంధమైన బంధకములలో నుండి విడుదల చేసి, తాను ప్రేమించిన తన కుమారుల యొక్క రాజ్యనివాసులను చేసెను". దేవునికి మహిమ కలుగును గాక! దేవుడు వెలుగైయున్నాడు, ఆ వెలుగును ఆయన మనకిచ్చాడు. మనలో ఉన్న చీకటిని పారద్రోలి, బలహీనతలను తీసివేసి, శాశ్వత జీవము నను గ్రహించు వెలుగైయున్న దేవుని సన్నిధిలోనే సదా నిలిచియుందాం!

**"మీరు పూర్వమందు చీకటియైఉన్నారు, ఇప్పుడైతే ప్రభువునందు వెలుగైయున్నారు"**

**- మరనాత.**

# I కొరింథి పత్రిక ధ్యానములు - 2

( గత సంచిక తరువాయి.. )

రెవ. గొట్టిపాటి యేసుదాసు, రేపల్లె

పాఠక మహాశయులకు క్రీస్తు ప్రభువు నామములో శుభాభివందనములు.

దేవుని చిత్తము వలన యేసుక్రీస్తు యొక్క అపోస్తలుడుగా నుండుటకు పిలువబడిన పౌలును, సహోదరుడైన సొస్తెనేసును కొరింథులోనున్న దేవుని సంఘమునకు, అనగా క్రీస్తు యేసునందు పరిశుద్ధపర్చబడినవారై పరిశుద్ధులుగా ఉండుటకు పిలువబడినవారికిని, వారికిని మనకును ప్రభువుగాఉన్న మన ప్రభువైన యేసుక్రీస్తు నామమున ప్రతిస్థలములో ప్రార్థించు వారందరికిని శుభమనిచెప్పి వ్రాయునది - మన తండ్రియైన దేవుని నుండియు, మన ప్రభువైన యేసుక్రీస్తు నుండియు కృపాసమాధానములు మీకు కల్గునుగాక (1 కొరింథి 1 : 1-3).

**అపోస్తలులు :-** అంటే పిలువబడినవారు అని అర్థము. ఒకస్థానము నుండి మరో స్థానములోనికి ఏర్పాటుచేయబడినవారు. మత్తయి 16 : 18 ప్రకారము యేసును దేవుని కుమారునిగా ఒప్పుకున్నవారు. దేవుని పనికై ప్రత్యేకింపబడినవారు. పరిశుద్ధులుగా ఉండుటకు పిలువబడినవారు. నిజదేవుని ఆరాధిస్తూ ప్రకటించేవారు. ఒకప్పుడు దేవుని ప్రజగా ఉండక ఇప్పుడు దేవుని ప్రజలయితిరి. ఒకప్పుడు కనికరింపబడక ఇప్పుడు కనికరింపబడినవారైతిరి (1 పేతురు 2 : 10). ఇట్టి పరిశుద్ధులు పిలువబడినవారై ప్రభువును ప్రకటిస్తూ ప్రార్థించుచున్న వారందరికీ పౌలుభక్తుడు శుభములు చెప్తున్నాడు.

అంతేకాక దేవుని కృపలో నిలిచి స్థిరముగా ఉన్నందున వీరే నిజమైన ఐశ్వర్యవంతులని ప్రశంశించుచున్నాడు. మరియు వీరు క్రీస్తు రాకడకై ఎదురుచూస్తూ అనేకులను సిద్ధంచేస్తు న్నారని పౌలు యొక్క నిరీక్షణ. కానీ వారు దారితొలగి ప్రాచీన ఆచారవ్యవహారఖర్మకాండలకు లొంగిపోయిన సంగతి ఆయనకు తెలియదు. అవును; నేటి సాఫీగా సాగిపోయే సంఘాలలోని విశ్వాసులు, బయటి ప్రపంచ పోకడలకు లొంగి ప్రాచీన అలవాట్లకు లోబడిన సంగతి కొందరికి తెలియదు. కొందరు తెలిసి వాటిని ఖండించుటలేదు. నేటి క్రైస్తవ సంఘానికి సువార్త కంటే సంస్కరణ కావాలి. కొరింథులోని విశ్వాసుల ఆధ్యాత్మిక జీవనవిధానము తాను ప్రకటించిన సువార్తకు ఋజువని పౌలు భావించుట తప్పుకాదు. దేవుని నమ్మిన విశ్వాసులను సేవకుడు నమ్మాలి. గానీ లోపాలను దాచుకొనుట అశీర్వాదము కాదుకదా! ప్రకటన 1 : 7 ప్రకారం క్రీస్తు బహిరంగముగా వస్తాడుగానీ రహస్యముగా రాడు. నిర్దోషులే అపరాధులపై దోషారోపణ చేయగలరు. స్వతంత్రులే పాపబానిసలెతే నిందించబడతారు. కొందరు మంచివారనుకునే విశ్వాసులు ఎందుకు నష్టపోతున్నారో సేవకునికి అర్థంకావడములేదు.

**పిలుపు :-** మూడువిధాలు. 1) దేవునిచే పిలుపు పొందిన దైవజనుని పిలుపు. 2) దైవదాసుని

ద్వారా పిలువబడిన సంఘము యొక్క పిలుపు. 3) సంఘమునుండి సేవకు పిలువబడిన వారి పిలుపు. రేపల్లె మన మరనాత విశ్వాస సమాజము నుండి 9 మంది దైవదాసులు ఆయా పట్టణాలలో సేవచేయుచూ 2019 జూన్ 11, 12, 13 తేదీలకు రేపల్లె సేవ 30 సంవత్సరాలు నిండిన సందర్భముగా వచ్చి, వారు ఏరీతిగా రక్షింపబడి సేవకు వెళ్ళారో, ఆ సంగతులు సాక్ష్యమిచ్చారు. ఆ సమయములో "సేవకు ఆధారం నీ దర్శనం - ఆత్మల సంపాదనకు అది నిదర్శనము" అనే పాట రచించి పాడుకున్నాము. "మన ప్రభువైన యేసు క్రీస్తు అను తనకుమారుని సహవాసమునకు మిమ్ము పిలిచిన దేవుడు నమ్మతగినవాడు" (1 కొరింథీ 1 : 9). సహోదరులారా! మిమ్మును పిలిచిన పిలుపునుచూడుడి (1 కొరింథి 1 : 26). దేవుని పిలుపు పొందిన వ్యక్తి ప్రవర్తన, పరిచర్యలు ప్రత్యేకముగా ఉంటాయి. అతని ద్వారా అద్భుతాలు క్రియాసాధకమౌతాయి. అతనినుండి అనేక క్రొత్తసంగతులు నేర్చుకునే అవకాశము కల్గుతుంది. పిలుపు పొందినవారు మాత్రమే సంఘాలను బలపర్చగలరు. మన సహవాసము తండ్రితోను, ఆయన కుమారుడైన యేసుక్రీస్తుతో కూడను ఉన్నది (1 యోహాను 1 : 3).

**పిలుపు ప్రత్యేకత :-** సేవారంభపు శూరత్వము అన్నీ వెంటనే చేయగలమనే ఆవేశాన్ని కల్గిస్తుంది. కాలగమనాన అననుకూల పరిస్థితులు ఎదురైనప్పుడు ఎందుకొచ్చానా ఈ సేవకు అనిపించవచ్చు. రక్షణలేనివారి శోధన ఒకప్రక్క రక్షింపబడినవారి కలిసిరాని అస్థిరత్వము మరో ప్రక్క. 2 తిమోతి 4 : 10 లో పౌలుగారు చెప్పినట్లు దేమా ఇహలోకాన్ని స్నేహించి వెళ్ళాడట. అవును బోధలు తమకు అనుకూలముగా లేవని కొందరు, తాము చెప్పినట్లు సేవకుడు నడవాలని కొందరు ఉండగా, కుటుంబ ఆరాధనలలోను, మందిర భోజనాలలోనూ మాంసాహారము వండాలనేవారు కొందరు. ఈ కారణముతో ఆరాధన విడిచిపెట్టినవారుకూడ ఉన్నారు. వీరంతా ఏనుగును విడిచి, ఎర్రచీమను పట్టుకునేరకాలు. మన రాష్ట్రములోని కొన్ని జిల్లాలవారు నాకు కఠిన బోధకుడు అని పేరుపెట్టారు. వారికి నా జవాబు ఏమిటంటే, అసలు బోధే కఠినముగా ఉంది, నేను కఠినుడను కాను అని. సువార్త వెలుగులో తమ జీవితాలను సరిచేసుకొనుటకంటే, పరులను విమర్శించుటలోనూ, తోటివారు దైవపనిలో వాడబడుతుంటే సహించలేని ఈర్ష్యా ద్వేషాలతోనూ నేటి క్రైస్తవం నింపబడిఉంది. "ఎందుకనగా జనులు హితబోధను సహింపక దురద చెవులు కలవారై తమ స్వకీయదురాశలకు అనుకూలమైన బోధకులను తమకొరకు పోగుచేసుకొని, సత్యమునకు చెవినియ్యక కల్పనా కథలవైపునకు తిరుగుకాలము వచ్చును. అయితే నీవు అన్ని విషయములలో మితముగా ఉండుము. శ్రమపడుము, సువార్తికుని పని చేయుము, నీ పరిచర్య ను సంపూర్ణముగా జరిగించుము (2 తిమోతి 4 : 3-5). కొంత కాలమునకు శిరచ్ఛేదనము చేయబడబోవు పౌలుభక్తుడు, తన ఆత్మీయ కుమారుడు తిమోతికి వ్రాసిన సంగతులు ఎంత వాస్తవములు.

పిలుపు పిలువబడిన వ్యక్తి కుటుంబాన్ని, సంఘాన్ని అంటిపెట్టుకుని ఉంటుంది.

లోకమంతా అన్యాయము చేస్తే పిలుపు న్యాయముచేస్తుంది. పాపం పడగొట్టే ప్రయత్నం చేస్తే పిలుపు నిలువబెట్టి చూపిస్తుంది. కారణాంతరమున విడిచిపెట్టేవారు, నూతనముగా చేరే వారిమధ్య పిలుపు మనలను బలపరుస్తుంది. దారి తొలిగినవారి సంగతేమిటని కొందరి ప్రశ్న. "దొంగను పోలీసు వ్యాను తరుముతున్నట్లు వారి లోపాలు గ్రహించేంతవరకు సాతాను వార్ని తరుముటకు దేవుడు అనుమతిస్తాడు". దేవుడు మేలుతోనే కీడును జయిస్తాడు గానీ కీడుచేయడు కదా! మరి దేవుడు మేలుచేసినా కీడునే ఎదుర్కొంటున్నారు అంటే వారి అతిక్రమాల్ని గ్రహించుటలేదన్నమాట. దైవసన్నిధికి వచ్చిపడేంతవరకు దేవుడు వారిని తరుముతూనే ఉంటాడు. మనము కూర్చున్నచోటే పూర్తి సత్యము లేదు. ఇతర దైవదాసుల నుండి కూడ నేర్చుకోవలసింది ఎంతో ఉంది. "మీరు పిలువబడిన పిలుపునకు తగినట్లుగా దీర్ఘశాంతముతో కూడిన పూర్ణవినయముతోనూ సాత్వికముతోనూ నడుచుకొనవలెనని, ప్రభువును బట్టి ఖైదీనైన నేను మిమ్మును బ్రతిమాలుకొనుచున్నాను (ఎఫెసి 4 : 3).

**1 కొరింథి పత్రిక వ్రాయుటకు గల కారణములు :-** సహోదరులారా, మీరందరు ఏకభావముతో మాటలాడవలెననియు, మీలో కక్షలులేక, ఏకమనస్సుతోనూ ఏకతాత్పర్యము తోనూ మీరు సన్నద్ధులై యుండవలెననియు, మన ప్రభువైన యేసుక్రీస్తు పేరట మిమ్మును వేడుకొనుచున్నాను. నా సహోదరులారా మీలో కలహములు కలవని మిమ్మును గూర్చి క్లోయె ఇంటివారివలన నాకు తెలియవచ్చెను. మీలో ఒకడు - నేను పౌలు వాడను, ఒకడు - నేను అపొల్లో వాడను, మరియొకడు నేను కేఫావాడను, ఇంకొకడు నేను క్రీస్తువాడనని చెప్పుకొను చున్నారని నా భావము (1 కొరింథి 1 : 10-12).

పౌలు భావాన్ని నిశితముగా పరిశీలిస్తే, సంఘములో కక్షలు, కలహములు, భేదము లున్నాయని అర్థమౌతుంది. సంఘ సంక్షేమాన్నికోరే మంచి విశ్వాసియైన క్లోయె అను సంఘ సభ్యుడు, సంఘమందలి కలహాలను లెక్కచేయక, సంఘ వ్యవస్థాపకుడైన పౌలు భక్తునికి సవివరముగా సందేశము పంపడము విశేషము. అప్పటికి పౌలుగారు ఎఫెసు పట్టణములో ఉన్నాడు. నాడు ఆత్మావేసితుడై దర్శనముతో ఏథెన్సు నుండి కొరింథునకు వచ్చి ప్రకటించిన సత్యము దారితొలగిందని, వదిలేసిన లోకము సంఘములోపలికి వచ్చిందని పౌలు తెలుసుకున్నాడు. సంఘ సంస్కరణ అత్యవసరమని భావించాడు. దైవసన్నిధిలో విచారణ చేసిఉంటాడు. 1) కలహాలను ఖండించి, సమసమాజ నిర్మాణము చెయ్యాలి. 2) సంఘ సభ్యుల దోషాన్నిబట్టి సంఘంపై కీడు రాకుండా చూడాలి. 3) లోపాలు లేనివారై ఇతరులను సంఘంలోనికి ఆహ్వానించాలి. 4) సంఘస్తులకు, ఇతరులకు జవాబు చెప్పగలవారై యుండాలి. ఈ అంశాలతో పౌలుభక్తుడు ఈ సంస్కరణ ఉత్తరాన్ని వ్రాశాడు.

**- మరనాత.** **( సశేషం )**

# జ్ఞానధార

1. విమర్శలను ఎదుర్కొనలేకపోతే కొత్తగా ఏమీ చేయలేవు.
2. కన్నీళ్ళను ఎప్పుడూ చులకన చేయకు, అవి మెదడు నుండి కాదు హృదయం నుండి వస్తాయి.
3. మనది కానిది మనం తీసుకుంటే మనకు రావాల్సింది రాదు.
4. మంచి పనులు ఆలస్యాన్ని సహించవు.
5. భుజబలం కంటే బుద్ధి బలం గొప్పది.
6. మనిషి ప్రేమతో కాకుండా ద్వేషంతో ఉంటే అతను రోగితో సమానం.
7. చాలా మంది సలహాలు తీసుకుంటారు కానీ వివేకవంతులే దాని నుంచి లాభం పొందుతారు.
8. జ్ఞానం అనేది మనం సంపాదిస్తే వచ్చేది కాదు, మనలోని అజ్ఞానాన్ని విడిచిపెడితే వచ్చేది.
9. అపజయాలు తప్పులు కావు, అవి భవిష్యత్తు పాఠాలు.
10. వందమంది శత్రువులు కన్నా ఒక్క నమ్మక ద్రోహి చాలా ప్రమాదకరం.
11. గొప్పగా జీవించడం అంటే ఆడంబరంగా జీవించడం కాదు, ఆనందంగా జీవించడం.
12. కోరికల యొక్క యథార్థ స్వరూపం దుఃఖం.

13 ప్రయత్నంచేసి ఓడిపో, ప్రయత్నం చేయడంలో మాత్రం ఓడిపోవద్దు.

14 ఉదాహరణ ఇవ్వడం చాలా సులువు. ఉదాహరణగా నిలవడం గొప్ప విషయం.

15 శత్రుత్వం మూర్ఖుల వృత్తి.

- డా॥ కొటారి మనష్షే, గుంటూరు

# వార్తల్లో కొన్ని...

## రోజుకో యాపిల్ తింటే నిమోనియా దూరం

**లండన్, సెప్టెంబరు 5 :** రోజుకో యాపిల్ తింటే.. ఊపిరితిత్తుల వాపు (నిమోనియా)వ్యాధి మన దరిచేరదంటున్నారు స్వీడన్‌లోని ఉమియా యూనివర్సిటీ శాస్త్రవేత్తలు. యాపిల్ లో ఉండే విటమిన్ సీ.. వ్యాధినిరోధక శక్తిని పెంచడమే దీనికి కారణంగా తమ పరిశోధనల్లో తేలిందన్నారు. దీనికోసం చుంచెలుకలపై అధ్యయనం చేశారు. నిమోనియాకు కారణమయ్యే బ్యాక్టీరియా దాడి చేసినప్పుడు దాన్ని ఎదుర్కొనేందుకు హైడ్రోజన్ పెరాక్సైడ్ విడుదల చేసిందని పరిశోధకులు నెల్సన్ గెకర చెప్పారు. ఆ హైడ్రోజన్ పెరాక్సైడ్ విడుదలలో కీలక పాత్ర పోషించే విటమిన్ సీ యాపిల్‌లో పుష్కలంగా లభిస్తోందన్నారు.

## బరువు తగ్గాలంటే.. రోజు మార్చి రోజు ఉపవాసం

**వాషింగ్టన్, సెప్టెంబరు 1 :** బరువు తగ్గాలనుకునే వారు ఉపవాసం పేరిట రోజూ కడుపు మాడ్చుకుంటూఉంటారు. ఇంకా అనేకరకాల పద్ధతులు ఫాలో అవుతూ అవస్థలు పడుతుంటారు. అయితే.. బరువు తగ్గాలనుకునేవారు రోజు మార్చి రోజు ఉపవాసం ఉంటే మంచిదని ఆస్ట్రియాలోని గ్రాజ్ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఉపవాసం వలన కలిగే ప్రయోజనాలపై పరిశోధకులు అధ్యయనం చేశారు. అందులో భాగంగా 60 మందిని ఎంపిక చేసి వారికి నాలుగు వారాలపాటు రోజు మార్చి రోజు ఉపవాసం సిఫారసు చేశారు. వారితోపాటు ఆరు నెలల ముందు నుంచే రోజు మార్చి రోజు ఉపవాసాన్ని కఠినంగా పాటిస్తున్న మరో 30 మందిపైనా వారు అధ్యయనం చేశారు. ఉపవాసం అలవాటు లేనివారి ఆరోగ్యంతో వారిని పోల్చి చూశారు. ఈ క్రమంలో రోజు మార్చి రోజు ఉపవాసం ఉండేవారు ఎక్కువ కేలరీలు కోల్పోతున్నారని గుర్తించామని గ్రాజ్ యూనివర్సిటీ ప్రొఫెసర్ ఫ్రాంక్ మడియో తెలిపారు

## స్వయంగా శుభ్రం చేసుకొనే రంగులు!

**న్యూఢిల్లీ, ఆగష్టు 31 :** తేమను, నీటిని పీల్చుకోకుండా, తనను తాను శుభ్రం చేసుకొనే పర్యావరణ హిత రంగులను ఢిల్లీలోని ఓ ప్రైవేటు వర్సిటీ శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు. శివ్ నాడార్ వర్సిటీ ఇంజనీరింగ్ కాలేజి ప్రొఫెసర్లు హర్‌ప్రీత్‌సింగ్, హర్‌ప్రీత్ అరోరా కలిసి ఈ రంగులను తయారుచేశారు. ప్రస్తుతం మార్కెట్లో ఉన్న విషపూరిత రసాయనాలతో తయారుచేసిన రంగులకు ఇవి ప్రత్యామ్నాయం కానున్నాయని తెలిపారు. వీటి ధర కూడా చాలా తక్కువేనని చెప్పారు. వరి పొట్టు నుంచి సేకరించిన నానో సిలికా రేణువులతో వీటిని తయారుచేశామని పరిశోధకులు తెలియజేశారు. ఇవి విషపూరితం కాదని, వీటిని గృహోపకరణాలపై కూడా వాడొచ్చని చెబుతున్నారు.

## శాకాహారానికి మారితే మెదడుకు పోషకాల కొరత!

**లండన్, సెప్టెంబరు 2 :** ఇంతకాలం మాంసాహారం తిన్న మీరు.. ఏవేవో కారణాలవల్ల శాకాహారానికి మారారా? అది ఏమాత్రం మంచిది కాదంటున్నారు బ్రిటన్ పరిశోధకులు. దీనివల్ల మెదడు సమర్థవంతంగా పనిచేసేందుకు అవసరమయ్యే కోలిన్ వంటి పోషకాలు సరిగా అందవని

వెల్లడించారు. దీనిని కాలేయమే స్రవించి నప్పటికీ.. అది శరీర అవసరాలకు సరిపోదని చెప్పారు. శాకాహారానికి మారడంవల్ల కాలేయ పనితీరు కూడా ప్రభావితమవుతుందన్నారు. మాంసం, గుడ్లలో కోలిన్ అధికంగా ఎక్కువగా లభిస్తుందని, శాకాహారంలో అలా ఉండదని చెప్పారు. ప్రస్తుతం చాలామంది శాకాహారం వైపు మళ్లడం వల్ల అది శరీరంలో కొరత ఏర్పడుతోందని పరిశోధకురాలు ఎమ్మా డెర్బిషైర్ అన్నారు.

## శీతల పానీయాల వినియోగంతో ప్రాణానికే ముప్పు!

**లండన్, సెప్టెంబరు 4 :** కాలంతో సంబంధం లేకుండా శీతలపానీయాలు తెగ తాగొద్దంటు న్నారు శాస్త్రవేత్తలు. ఎక్కువగా తాగితే ముందుగానే మరణించే అవకాశాలు ఎక్కువని హెచ్చరిస్తున్నారు. బ్రిటన్‌లోని లండన్ ఇంపీరియల్ కాలేజీ పరిశోధకుల అధ్యయనంలో ఈ విషయం వెల్లడైంది. ఈ అధ్యయనంలో భాగంగా 4.50 లక్షల మంది శీతలపానీయాల వినియోగాన్ని వారు పరిశీలిం చారు. రోజుకు రెండు గ్లాసుల కంటే ఎక్కువ డ్రింకు తాగిన వారు ముందుగానే మరణించే ప్రమాదం ఎదుర్కొంటున్నారని అధ్యయనానికి నేతృత్వం వహించిన ముర్ఫి వెల్లడించారు.

## మలేరియా పరాన్నజీవి గుట్లన్నీ రట్టు

**లండన్ :** ఏటా ప్రపంచవ్యాప్తంగా 20 కోట్ల మంది మలేరియా బారిన పడుతున్నారు! మలేరియాకు మందు ఉన్నా కూడా.. దాదాపు 5 లక్షల మంది దానివల్ల ప్రాణాలు కోల్పోతు న్నారు. ఇంతమంది ప్రాణాలు తీస్తున్న ఆ మహమ్మారి పరాన్నజీవి తాలూకూ పూర్తి వివరాల ను (మలేరియా సెల్ అట్లాస్) బ్రిటన్‌కు చెందిన వెల్‌కమ్ సేంజర్ ఇన్‌స్టిట్యూట్ పరిశోధకులు రూపొందించారు. దీని ఆధారంగా భవిష్యత్తులో మలేరియాను సమర్థంగా నిరోధించే టీకాలు, మలేరియాను తగ్గించే మందులను తయారు చేయవచ్చని వారు వివరించారు.

## పిండం పరమాణు స్థాయి మ్యాప్

**న్యూయార్క్ :** అమ్మ కడుపులో పిండం.. పిసరంత పరిమాణం నుంచి రోజురోజుకూ ఇతోధికంగా అభివృద్ధిచెంది తొమ్మిది నెలల తర్వాత ముద్దులొలికే శిశువుగా ఈ లోకంలోకి వస్తుంది! గర్భస్థ పిండంలోని కణాల్లో.. ఈ ఎదుగుదలకు కారణమైన పరమాణుస్థాయి వివరాలను అమెరికా పరిశోధకులు పూర్తి స్థాయిలో నమోదు చేయగలిగారు. ఆ వివరాల తో సవివరమైన మ్యాప్‌ను రూపొందించారు. ఈ ప్రయోగాన్ని వారు సి.ఎలిగాన్స్ అనే క్రిమిపై చేశారు. ఆ క్రిమి తాలూకూ గర్భస్థ పిండంలోని 80 వేలకు పైగా కణాలను పరిశోధించారు. ఈ పరిశోధన కోసం తాము ఉపయోగించిన పద్ధతిద్వారా.. ఏయే కణాల్లో ఏయే జన్యువులు క్రియాశీలంగా ఉన్నాయో గుర్తించవచ్చని వారు తెలిపారు.

## పుట్టగొడుగులు తింటే.. ప్రొస్టేట్ కేన్సర్ దూరం!

**టోక్యో, సెప్టెంబరు 8 :** వారానికి మూడుసార్లు ఆహారంలో పుట్టగొడుగులు తీసుకొంటే ప్రొస్టేట్ కేన్సర్ దరిచేరదంటున్నారు శాస్త్ర వేత్తలు. ఈ కేన్సర్‌పై జపాన్ లోని తొహోకు యూనివర్సిటీ పరిశోధకులు అధ్యయనం చేశారు. 40-79 ఏళ్ల మధ్య వయస్కులు 36,499 మందిపై వారు పరిశోధనలు జరిపారు. వారందరిలో వారానికి ఒకటి లేదా రెండు సార్లు పుట్టగొడుగులు తిన్నవారికంటే మూడు లేదా అంతకంటే ఎక్కువసార్లు తీసుకున్నవారు ఎక్కువ ఆరోగ్యవంతంగా ఉన్నట్లు తెలిపారు. వీరికి ప్రొస్టేట్ కేన్సర్ ముప్పు కూడా లేదని వెల్లడించారు.




-: ప్రతుల కొరకు : -

విజయవాడ - 89777 61512: 0866- 2480047

హైదరాబాద్ - 99896 98072

విశాఖపట్నం - 94405 74118

R.N.I.No.66564/83 Regn.No.VJ/023/2018-2020
Posted at BPC, Gollapudi, VIJAYAWADA - 521 225
Printed on 08-10-19 No. of pages 28 Posting date : 9th & 10 of every month

మరనాత విశ్వాస సమాజము సమర్పించు

# మరనాత దర్శనం

## ఆధ్యాత్మిక టీ.వీ. కార్యక్రమములు

దైవదాసులు శ్రీ గుళ్లపల్లి మోజెస్ చౌదరి,

దైవదాసులు శ్రీమతి & శ్రీ అల్లూరి విశ్వప్రసాద్

దైవదాసులు డా॥ నిరీక్షణ కంచర్ల గార్లు

ఆధ్యాత్మిక వర్తమానములు అందించెదరు.

## కల్వరి ఛానల్‌లో

బుధవారం రాత్రి 8 - 8 : 30 గంటల వరకు
శుక్రవారం ఉదయం 6:30 - 7 గంటల వరకు
శనివారం రాత్రి 7 - 7 : 30 గంటల వరకు

## ఆరాధన ఛానల్‌లో

గురువారం ఉదయం 7 - 7 :30 గంటల వరకు

## శుభవార్త ఛానల్‌లో

సోమవారం మధ్యాహ్నం 1 :30 - 2 వరకు
శుక్రవారం రాత్రి 9 :30 - 10 గంటల వరకు




R.N.I.No.66564/83 Regn.No.VJ/023/2018-2020
Posted at BPC, Krishna Lanka, VIJAYAWADA - 520 013.
Printed on 08-06-19 No. of pages 28 Posting date : 9th & 10 of every month

శిక్షణ పొందండి ! శిష్యులనుగా చేయండి!!

# మరనాత వేద పాఠశాల – విశాఖ

## మరనాత విశ్వాస సమాజపు పరిచర్య

"దైవసేవ - దేశసేవా తత్పరులైన యువతకు అద్భుత అవకాశం"



దైవజనులు
శ్రీ గుళ్ళపల్లి మోజెస్ చౌదరి గారు

జన్మ, కర్మ పాప బంధితులు, బానిసలైన మానవాళికి యేసుక్రీస్తు యొక్క అవతారంలో విముక్తి లభ్యమైనది. ఈ గొప్ప సువార్తను ప్రజలు విశ్వసించి, పాప విమోచన, ఆత్మ రక్షణ పొందాలంటే ఈ శుభవార్తను తెలుగువారికి చాటించే వారుండాలి. అందుకు సుశిక్షితులైన యువత కావాలి! లేవాలి!! అందుచేతనే స్వయాన ప్రభువు వారే "కోత విస్తారమేగాని పని వారు కొద్దిగా ఉన్నారు" అని వాపోయారు.

ఇటువంటి దైవసేవ చేయాలనే ఆశ, దేవుడు పిలిచాడనే నిశ్చయత మరియు ఆయన పనిపట్ల సమర్పణ గలవారికి వాక్య సేవా తర్ఫీదు నివ్వాలనే దర్శనంతో 'మరనాత వేద పాఠశాల' 33 సంవత్సరాల క్రితం దైవదాసులు శ్రీ గుళ్ళపల్లి మోజెస్ చౌదరి గారిచే స్థాపించబడింది.

**నిర్వహించే కోర్సులు :**

1) Diploma in Biblical Studies (D.B.S) రెండు సం॥లు (4 సెమిస్టర్లు)
2) Bachelor of Theology (B.Th) మూడు సం॥లు (6 సెమిస్టర్లు)
3) 40 రోజుల వేసవి వేదపాఠశాల (ఏప్రిల్ 9- మే నెల 19 వరకు)

అర్హతలు : రక్షణానుభవము, సేవార్హమైన దేవుని పిలుపు, సమర్పణ, 18 సం॥లు పైన వయస్సు గలవారు.

**స్త్రీలకు ప్రత్యేక వసతి**

వాక్యతర్ఫీదు పొందదాసక్తి గలవారు అప్లికేషన్ నిమిత్తము రూ.100/-లు పంపి, పొంది, పూర్తి చేసి వెంటనే పంపించవలెను. భోజనము, వసతి : ఉచితం; బోధనా భాష : తెలుగు.




**ప్రత్యేకతలు :**

- ఉన్నత విద్యార్హతలు
- వాక్య పరిజ్ఞానము
- స్వదేశీ, విదేశీ సేవానుభవం కల్గిన అధ్యాపక బృందం మరియు
- వ్యక్తిగత శ్రద్ధ
- క్రమశిక్షణ
- సిద్ధాంత, ఆచరణాత్మక సత్శిక్షల సమన్వయము.

వివరములకు :

రెవ. శిరిపురపు సైలస్ ప్రకాష్
M.Com., M.Div. (USA)
డైరెక్టర్, మరనాత వేద పాఠశాల
50-43-9, టి అండ్ టి కోలనీ, సీతమ్మధార,
విశాఖపట్నం-530013.
✆ : 98481 24651,
9949590555, 8897884111
maranathavisakha@gmail.com




మరనాత
బిబ్లికల్ సెమినరీ
విజయవాడ
Accredited by
Asia Theological Association &
Christ For The Nations Association of Bible Schools
కోర్సులు కాలపరిమితి బోధనాభాష
B.Th 3 సంవత్సరాలు ఇంగ్లీష్ & తెలుగు
Dip.Th 2 సంవత్సరాలు తెలుగు
C.Th ఒక సంవత్సరం తెలుగు
శ్రీ అల్లూరి విశ్వప్రసాద్
జూన్ 24 నుండి క్లాసులు ప్రారంభం
అభిషిక్తులు, అనుభవజ్ఞులైన అధ్యాపకులచే బోధన.
2019
ఏప్రిల్ 8 - మే 17 వరకు
విశిష్టతలు
Spoken English Courses
ATA Curriculum
మరనాత విశ్వాస సమాజము
E-mail : mvpvja8@gmail.com
9642793777
9441308156, 7799212199
2